PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 109 | విజయవాడ, గురువారం 21 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 21 November 2024 | Rs

పేదలపై బ్రహ్మాస్త్రం

- భూ దురాక్రమణ చట్టంపై రౌండ్‌టేబుల్‌లో వక్తల ఆగ్రహం
- దళితులు, బలహీనవర్గాలను అణచివేసే చర్య

2



అదరగొట్టిన అమ్మాయిలు

- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్
- ఫైనల్లో చైనాపై 1-0తో గెలుపు

8


ప్రజలతో ముఖాముఖి

ఆడబిడ్డల జోలికి వస్తే సహించం

శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. టిడిపి కూటమి ప్రభుత్వం గత 162 రోజుల్లో చేపట్టిన పథకాల అమలుపై బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, తాను స్వయంగా పాల్గొని సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనపై ప్రజల నుండి సలహాలు, సూచనలు స్వీకరిస్తానని చెప్పారు. ఇకనుండి రాష్ట్రంలో ఏ ఆడబిడ్డను అవమానపరిచినా వారికి అదే చివరిరోజవుతుందని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియా సైకోలు, గంజాయి ముఠాలను అరికట్టడంలో ఏ మాత్రమూ రాజీ లేదని చెప్పారు. బ్లేడ్ బ్యాచ్‌లకు కూడా పోలీసుపవర్ ఏంటో చూపిస్తామన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలే ధ్యేయంగా పని చేస్తామని అన్నారు. సూపర్-6తో పాటు తాము విడుదల చేసిన మేనిఫెస్టో హామీలకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ' విధ్వంసమైన వ్యవస్థ, గాడి తప్పిన యంత్రాంగం, గత ప్రభుత్వ అప్పులు, తప్పులు, పాపాలు, నేరాలు మాకు వారసత్వంగా వచ్చాయి. ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. అభివృద్ధి కోసం మేం ఇటుకాఇటుకా పేరుస్తున్నాం. రాత్రికి రాత్రే అద్భుతాలు జరగవు.' అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ హయంలో రూ.10 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని చెప్పారు. అయినా, తమ ప్రభుత్వం ఈ 162 రోజుల్లో ఎన్నో పనులు చేసిందని చెబుతూ, వాటిని వివరించారు. ఏ రాష్ట్రంలోనే లేని విధంగా రాష్ట్రంలో సామాజిక పెన్షన్లు ఇస్తున్నట్లు సిఎం తెలిపారు. పేదల కోసం 198 చోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభించామని, మహిళలకు యేడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు.



త్వరలో ఇళ్ల స్థలాలు

గృహ నిర్మాణానికి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇచ్చేందుకు త్వరలో కార్యచరణ చేపడతామని సిఎం చంద్రబాబు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇస్తామన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందని, డిసెంబర్ నుండి రాజధాని పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. పోలవరానికి రూ.12,127 కోట్లు కేంద్రం మంజూరు చేసిందని, ప్రాజెక్టు నిర్మాణం 45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మాణం జరుగుతుందన్నారు. వాట్సాప్ లో ఒక్క మెసేజ్ పెడితే రైతుల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తారని సిఎం తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి కుళాయి ద్వారా మంచినీళ్లు అందిస్తామని సిఎం తెలిపారు. డిఎస్‌సి ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ ఇస్తామన్నారు. రాతపరీక్షలు పూర్తి చేసి నియామకాలు చేపడతామని తెలిపారు. నియోజకవర్గంలో బెల్టు షాపులు లేకుండా చూసుకునే బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలన్నారు. సీనరేజ్, జీఎస్టీ లేకుండా ఉచిత ఇసుకను అందిస్తున్నామని తెలిపారు. కొందరు పత్తి వ్యాపారులు చిన్న కారణాలు చూపి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది...రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని, త్వరలో సమీక్ష చేస్తామని చంద్రబాబు తెలిపారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్

- క్యాబినెట్ నిర్ణయం
- రిజిస్ట్రార్‌కు ప్రభుత్వ లేఖ

పజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. హైకోర్టు బెంచ్‌తో పాటు ఈగల్ పేరుతో యాంటీ నార్కోటిక్ విభాగాన్ని కూడా కర్నూలులో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కేబినెట్ నిర్ణయం అనంతరం ఇదే విషయాన్ని హైకోర్టు రిజిస్ట్రార్‌కు ప్రభుత్వం తెలియచేసింది. న్యాయశాఖ కార్యదర్శి ఈ మేరకు లేఖ రాశారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల్లో 1.59 కోట్ల మంది ప్రజలున్నారని, రాష్ట్ర జనాభాలో వీరు 25శాతమని లేఖలో తెలిపారు. ఈ ప్రాంతం నుండి విజయవాడకు రావడానికి ఒకేఒక రైలు ఉందని , దీంతో సామాన్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అదే సమయంలో హైకోర్టు బెంచ్‌లు ఉన్న వివిధ రాష్ట్రాల జాబితాను కూడా పేర్కొన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయవ్యవస్థ దృష్టికి తీసుకుపోవాలని కోరారు. దీనితో పాటు నేరాల నియంత్రణ కోసం పిడి యాక్ట్‌ను మరింత పటిష్టపరచాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. దీనికోసం రూపొందించిన చట్ట సవరణ బిల్లుకు కూడా మంత్రిమండలి ఆమోద ముద్ర వేసినట్లు తెలిసింది. అమరావతినిర్మాణ పనులు కొనసాగించేందుకు సాంకేతిక కమిటీ ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదించినట్లు, దానిలో భాగంగా అమరావతి పనులకు కొత్తగా టెండర్లు పిలవాలని మంత్రి మండలి నిర్ణయించినట్లు తెలిసింది. రూ.85 వేలకోట్లపెట్టుబడులకు సంబంధించి ఎస్ఐపిబి తీసుకున్న నిర్ణయాలకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

వలంటీర్లు లేరు

రాష్ట్రంలో ఆ వ్యవస్థ మనుగడలో లేదు • లేని వారికి వేతనాలు ఎలా ఇస్తాం?

సాంకేతిక కారణాల వల్ల వారిని కొనసాగించలేం

మండలిలో మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి • కలకలం రేపిన ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'రాష్ట్రంలో వలంటీర్లు లేరు. వలంటీర్ల వ్యవస్థ మనుగడలో లేదు.' అని గ్రామ సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రకటించారు. తమ భవిష్యత్తుపై రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అసలు ఆ వ్యవస్థే ఉనికిలో లేదని మంత్రి చెప్పడం గమనార్హం. మంత్రి చేసిన ఈ ప్రకటన రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లలో కలకలం రేపింది. ఎపి గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ (సిఐటియు) నేతలు మంత్రిని కలిశారు. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షలమంది వలంటీర్లను వైసిపి ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. వీరిలో ఎన్నికలకు ముందు లక్షమంది రాజీనామా చేశారు. వీరిలో అప్పటి ప్రభుత్వ ఒత్తిడి మేరకు రాజీనామా చేసిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తమను పనుల్లో కొనసాగించడంతోపాటు, వేతనం కూడా త్వరలోనే పెంచుతారని ఆశిస్తున్న వీరిని ప్రభుత్వ తాజా ప్రకటన తీవ్ర ఆందోళనకు గురిచేసింది. దీంతో వీరంతా పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. అంతకుముందు శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. వైసిపి సభ్యులు పి. రామసుబ్బారెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, రమేష్ యాదవ్‌లు వలంటీర్ల వ్యవస్థపై అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ మంత్రి ఈ ప్రకటన మిగతా 7లో



వేతనాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

మంత్రిని కలిసిన యూనియన్ నేతలు

మంత్రి ప్రకటన కలకలం రేపిన నేపథ్యంలో ఎపి గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మితో పాటు పలువురు నాయకులు బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మంత్రి బాల వీరంజనేయస్వామిని కలిశారు. మంత్రి ప్రకటనతో నెలకొన్న ఆందోళనను వివరించారు. వలంటీర్లను కొనసాగించాలని, బలవంతంగా రాజీనామా చేసిన వారినందరిని విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 10 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని కోరారు. వీరి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి తాను మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పానని వివరించారు. వలంటీర్ల ఆందోళనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు.

పిఎసికి ఎన్నికలు

- నేటి మధ్యాహ్నంలోగా నామినేషన్లు
- వివాదాస్పదమవుతున్న ప్రభుత్వ నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంప్రదాయంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీకి ఇచ్చే అసెంబ్లీ పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ చైర్మన్ పదవితో పాటు, కమిటీలోని ఇతర సభ్యుల స్థానాల భర్తీకి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో పాటు ప్రభుత్వ అంచనాల కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలకు కూడా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనుంది. ఈ పదవుల కోసం నేటి (గురువారం)మధ్యాహ్నంలోగా శాసనసభ కార్యదర్శి వద్ద నామినేషన్లు దాఖలు చేయాలని, అవసరమైతే శుక్రవారం ఎన్నికలు జరుగుతాయని ప్రకటించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వివాదాస్పదంగా మారుతోంది. శాసనసభలో తెలుగుదేశం కూటమికి పూర్తి స్థాయి మెజార్టీ ఉన్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో పిఎసి ఛైర్మన్‌తో పాటు అన్ని పదవులు కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బిజెపిలకే దక్కనున్నాయి. దీంతో పబ్లిక్ ఎక్కౌంట్స్ కమిటీ ఛైర్మన్ (పిఎసి) పదవిని ప్రతిపక్ష పార్టీకి ఇస్తూ దాదాపు 60 సంవత్సరాలుగా కొనసాగిన సాంప్రదాయినికి బ్రేక్ పడనుంది.

1966 నుంచి రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షానికి పిఎసి ఛైర్మన్ పదవిని కేటాయిస్తూ ఉన్నారు. ప్రస్తుతం శాసనసభలోని అధికారకూటమి, ప్రతిపక్షం మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రతిపక్షస్థానంలో ఉన్న వైసిపి శాసనసభ సమావేశాలకు కూడా గైర్హాజరవుతోంది. ఈ నేపథ్యంలో పిఎసితో పాటు ఇతర కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలన్న తీర్మానాన్ని ముఖ్యమంత్రి తరపున ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టారు. దీనిని సభ ఆమోదించింది. ఇదే తీర్మానాన్ని ాసన మండలిలో మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తీర్మానం ప్రవేశపెట్టారు. మండలి నుంచి ప్రతి కమిటీకి ముగ్గురు సభ్యులను ఎన్నుకునేందుకు వీలుగా రూల్ 263 ద్వారా తీర్మానం ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. తీర్మానంను పరిగణలోకి తీసుకుని ఎన్నికల షెడ్యూలును మండలి ఛైర్మన్ మోషన్‌రాజు ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట లోగా నామినేషన్లు దాఖలు చేయాలని, మూడు గంటల వరకు నామినేషన్ల పరిశీలన, ఐదు గంటలలోగా ఉపసంహరణ ఉంటుందన్నారు. ఎన్నికలు అవసరం అయితే శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

ఎన్నికల్లో పోటీ చేస్తాం :
మండలిలో ప్రస్తావిస్తాం : బొత్సా

పిఎసి ఛైర్మన్ పదవిని ప్రతిపక్ష పార్టీలకు కేటాయించడం గత 60 ఏళ్లుగా అనవాయితీగా వస్తుందని మండలిలో ప్రతిపక్షనాయకుడు బొత్సా సత్యనారాయణ తెలిపారు. బ ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి కాకుండా ఎక్కువ స్థానాలు ఉన్న జనసేన ప్రభుత్వంలో భాగస్వామిగా ఉందని, అందువల్ల అనవాయితీ ప్రకారం ఈపదవి వైసిపికి ఇవ్వాలని చెప్పారు.

గత ప్రభుత్వ హయంలో తాము పయ్యావుల కేశవ్‌ను పిఎసి ఛైర్మన్‌గా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలు నిర్వహిస్తే తాము నామినేషన్లు వేస్తామని,మండలిలో తమకే బలం ఉందన్నారు.ఈ అంశంపై మండలిలో గురువారం ప్రస్తావిస్తామన్నారు.

రోడ్డెక్కితే ట్యాక్సా?

- జగన్‌మోహన్‌రెడ్డి విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంపద సృష్టిస్తామంటూ ప్రజలపై అంటూ ట్యాక్సులు వేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విమర్శించారు. వైసిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా రోడ్లపై కూడా టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తామనడం అత్యంత విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. 'రోడ్డెక్కితే బాదుతారా?' అని ప్రశ్నించారు. మహిళల అదృశ్యంపై దుష్ప్రచారం చేశారని, తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఆరు నెలల కాలంలో 46 మంది మహిళలు ట్రాఫికింగ్‌కు గురయ్యారని అసెంబ్లీలో చెప్పారని అన్నారు. దీనిని ఏమంటారని ప్రశ్నించారు. వలంటీర్ల విషయంలోనూ అదే జరుగుతోందన్నారు. . పనిలో లేరని చెబుతూనే ఈ ఏడాది బడ్జెట్లోనూ నిధులు కేటాయించారని చెప్పారు. ఉద్యోగులను మోసం చేశారని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని అన్నారు. చివరకు తన కుటుంబపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కుటుంబంలో ఉన్న స్పర్థలను సాకుగా చూపి తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారని అన్నారు స్కిల్‌స్కాములతో చంద్రబాబు ప్రమేయం లేకపోతే అదే కేసులో ఉన్నవాళ్ల ఆస్తులను ఇడి ఎందుకు ఎటాచ్ చేసిందో సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. అప్పుల విషయంలోనూ అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. వాస్తవాలు ఏమిటో బాబు ప్రవేశపెట్టిన బడ్జెట్ పత్రాలు చెబుతాయని అన్నారు. కాగ్ నివేదికలోనూ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. కాగ్ నివేదిక తప్పని అనుకుంటే అసెంబ్లీలోనూ అదే ప్రవేశపెట్టారని తెలిపారు. అలా ఎందుకు చేశారో ప్రజలకు చెప్పాలని జగన్ కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ.42 వేల కోట్లు బకాయిలు వదిలేశారని, అంత పెద్దమొత్తం బకాయి ఏ ప్రభుత్వమూ ఉంచదని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంతో పోలిస్తే వైసిపి ప్రభుత్వం నాలుగు శాతం తక్కువ అప్పులు చేసిందని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మిగతా 7లో



వైసిపి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న జగన్

50 శాతం ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోం

- వాయు కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ : వాయుకాలుష్యం మరింత తీవ్రమైన నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన అన్ని కార్యాలయాలు 50 శాతం ఉద్యోగులతోనే పని చేయాలని, మిగిలిన 50 శాతంమంది ఇళ్ల నుంచి పనిచేయాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల నుంచి అత్యవసర సర్వీసులైన ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య సంబంధిత కార్యాలయాలు, అగ్నిమాపక, జైలు, ప్రజా రవాణా, విద్యుత్, వాటర్, పారిశుధ్యానికి సంబంధించిన సరీస్వులకు మినహాయింపు నిచ్చింది. ఢిల్లీలో వాయుకాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ప్రకారం బుధవారం ఉదయం 9 గంటలకు ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) తీవ్రమైన కాలుష్యం కేటగిరిలోని 426గా నమోదైంది. భారత వాతావరణ శాఖ వివరాల ప్రకారం మంగళవారం రాత్రి అత్యంత కనిష్టంగా 11.1 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు దిగజారాయి.



మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ముగిసిన పోలింగ్

- పర్లీలో ఎన్‌సిపి (ఎస్‌పి) నేతపై దాడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు 15 రాష్ట్రాల్లో ఉప ఎన్నికల ఘట్టం పూర్తయింది. కొన్నిచోట్ల దాడులు, బెదిరింపులు, పోలింగ్ కేంద్రాల ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. సాయంత్రం 5 గంటల సమయానికి జార్ఖండ్‌లో 67.59 శాతం, మహారాష్ట్రలో 58.22 శాతం పోలింగ్ నమోదైంది. అప్పటికి ఇంకా చాలా ప్రాంతాల్లో ఓటర్లు క్యూలైన్లలో న్నారు. ముంబయి, పూణే, థానే వంటి నగరాల్లో తక్కువ శాతం ఓటింగ్ జరిగింది. మహారాష్ట్రలోని మొత్తం 288 స్థానాలకు ఒకే దశలో, జార్ఖండ్‌లోని 38 స్థానాలకు (రెండో దశ) పోలింగ్ బుధవారం ముగిసింది. 15 రాష్ట్రాల్లోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలు కూడా బుధవారం జరిగాయి. రెండు దశల్లో 15 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు పూర్తయ్యాయి. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపికి చెందిన స్థానిక నేత మాధవ్ జాదవ్‌పై పర్లీ టౌన్‌లోని బ్యాంక్ కాలనీ ప్రాంతంలో దాడి జరిగింది. దీంతో, ఘట్నందూరు గ్రామంలోని పోలింగ్ బూత్‌ను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. ధ్వంసమైన ఇవిఎంల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించారు. నందుర్‌బార్ నియోజకవర్గంలో ఇవిఎంలలో సాంకేతిక సమస్యల కారణంగా ఓటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. కొత్తవి ఏర్పాటు చేసిన తరువాత పోలింగ్ తిరిగి కొనసాగింది. మహారాష్ట్రలోని బీడ్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బాలాసాహెబ్ షిండే ఛత్రపతి సాహూ విద్యాలయంలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడి గుండెపోటుతో మరణించారు.

యుపిలో ఎన్నికల అక్రమాలు

- ఏడుగురు పోలీసులపై ఇసి వేటు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం ఉప ఎన్నికలు జరిగాయి. కుందర్కి సహా పలు నియోజకవర్గాల్లో అక్రమాలు జరిగాయని, రీపోలింగ్ నిర్వహించాలని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసింది. కుందర్కిలో నకిలీ ఓటింగ్‌తో పాటు, ఒక మతానికి చెందిన ఓటర్లను పోలింగ్ కేంద్రానికి రాకుండా అడ్డుకున్నారని పేర్కొంటూ ఎస్‌పి అభ్యర్థి మహమ్మద్ రిజ్వాన్ ఇసికి లేఖ రాశారు. బుధవారం ఉదయం నుంచి అడ్మినిస్ట్రేటివ్, పోలీస్ సిబ్బంది పక్షపాతంతో వ్యవ హరించారని, ఎస్‌పి మద్దతుదారులను బెదిరించారని లేఖలో పేర్కొన్నారు. పోలింగ్‌ను రద్దు చేసి, రిపోలింగ్ నిర్వహించాలని కోరారు. ఉప ఎన్నికలు న్యాయంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని అధికారుల్ని ఎన్నికల సంఘం ఆదేశించింది. మార్గదర్శకాలను ఉల్లంఘించినం దుకు రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు పోలీసు సిబ్బందిని ఇసి సస్పెండ్ చేసింది. కాన్పూర్ జిల్లా సిసామౌ స్థానంలో ఓటర్ ఐడి కార్డులను తనిఖీ చేసిన వీడియో వైరల్ కావడంతో ఇద్దరు ఎస్‌ఐలపై వేటుపడింది. కుందర్కి నియోజకవర్గంలో ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసింది.

ధాన్యం రైతు దైన్యం

- దోచుకుంటున్న దళారులు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి ఆటంకాలు
- గోనె సంచులూ కొరతే
- నేటికీ బ్యాంకు గ్యారంటీలు సమర్పించని సగంమంది మిల్లర్లు



ధాన్యం సేకరిస్తున్న ప్రైవేటు వ్యక్తులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

'మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఏలేరు వరదల వల్ల కొంత పంటను కోల్పోయాను. 65 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు సిబ్బంది జాడ లేకపోవడం, వాతావరణం సరిగా లేకపోవడంతో 75 కిలోల బస్తాను రూ.1,500 చొప్పున దళారులకు తెగనమ్ముకోవాల్సి వచ్చింది. సుమారు రూ.14 వేలు నష్టపోయాను'

-ఇదీ కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు ఏలేటి వీరబాబు ఆవేదన

ఇదే ప్రాంతానికి చెందిన మోగిలి తమ్మిరాజు నాలుగు ఎకరాల్లో సన్నాలు రకం వరి సాగు చేశారు. 88 బస్తాలు దిగుబడి వచ్చింది. స్వర్ణ రకం ధాన్యం మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రంలో చెప్పడంతో తాను పండించిన ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కాకినాడ జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనని రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. జిల్లాలో గత కొన్ని రోజులుగా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులకు మద్దతు ధర దక్కేలా, నచ్చిన చోట అమ్ముకునేలా, 24 గంటల్లోగా డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని టిడిపి కూటమి ప్రభుత్వంతోపాటు అధికారులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో 2.15 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఖరీఫ్‌లో మిగతా 7లో

విశాఖ డెయిరీ అక్రమాలపై హౌస్ కమిటీ

- స్పీకరు వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ డెయిరీ అక్రమాలు, నిధుల మళ్లింపుపై శాసనసభలో స్పీకరు అయ్యన్నపాత్రుడు హౌస్ కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో విశాఖ డెయిరీపై జరిగిన చర్చలో సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ.. విశాఖ డెయిరీ యాజమాన్యం, డైరెక్టర్లు ఒకే కుటుంబం చేతిలో ఉండటంతో పాల ఉత్పత్తిదారులకు ధరలు తగ్గించి దోపిడీకి పాల్పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సొసైటీ నుంచి విశాఖ డెయిరీ నుంచి ఒక కార్పొరేట్ కంపెనీగా మార్చి నిధులు దారి మళ్లిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. రూ.కోట్లు ఆస్తులను వ్యక్తిగతంగా, కూడబెట్టుకున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దారిమళ్లిన నిధులు, అవినీతి, కుటుంబ పెత్తనంపై సభా సంఘాన్ని నియమించాలని ప్రభుత్వాన్ని సభ్యులు డిమాండ్ చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. విశాఖ డెయిరీపై సమగ్ర విచారణ జరపాల్సిన ఆవశ్యకత ఉందని, ప్రస్తుతం సొసైటీ నుంచి కార్పొరేట్ కంపెనీగా మారిన నేపథ్యంలో ప్రభుత్వ పరంగా ఏ మేరకు విచారణ చేయొచ్చనే విషయాన్ని అధికారుల ద్వారా సమాచారాన్ని తీసుకుంటామన్నారు. సభ అనుమతి తీసుకుని విచారణ కోసం హౌస్ కమిటీని నియమించాలని స్పీకరుకు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. హౌస్ కమిటీ విషయంపై సభలోని సభ్యుల అనుమతి తీసుకున్న అనంతరం హౌస్ కమిటీ వేస్తున్నట్లు స్పీకరు అయ్యన్నపాత్రుడు శాసనసభలో ప్రకటించారు.

విశాఖ ఉక్కుపై మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలి : ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగిస్తామని స్పష్టమైన ప్రకటన చేయాలని ఉక్కు ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు బుధవారంనాటికి 1378వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో ట్రాఫిక్, టిపిపి విభాగాలకు చెందిన ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి రమణ మాట్లాడుతూ.. 1378 రోజులుగా దీక్షలు చేస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఉక్కు కర్మాగారంపై వేలాది మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడానికి కేంద్రం పూనుకోవడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో నాయకులు సత్తి శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, మంత్రి గోపి నారాయణ, నాయుడు, డిఎస్‌పి రెడ్డి, అశోక్, దుర్గారెడ్డి, వి.అప్పలరాజు, తాతాజీ నాయుడు పాల్గొన్నారు.

మహిళలపై దారుణాలు అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలపై ప్రతిరోజూ జరుగుతున్న దారుణాలను అరికట్టాలని, విశాఖలో న్యాయ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి కోరారు. ఈమేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో మహిళలపై ఆకృత్యాలు విపరీతంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్న చెల్లిని బ్లాక్ మెయిల్ చేసి అత్యాచారం చేసిన ఘటనలూ ఉన్నాయని తెలిపారు. ఘటన జరిగిన ప్రతిసారీ నిందితులను శిక్షిస్తామని ముఖ్యమంత్రి, హోమ్‌శాఖ మంత్రి ప్రకటిస్తున్నారని, ఎన్నిసార్లు ఇలా చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండు చేశారు. ఐదు నెలల కాలంలో ఒక్కకేసుపైనా విచారణ జరగలేదని తెలిపారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి,యువజన, మహిళా సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేశారని వారు డిమాండు చేశారు.

సురక్షిత నీరు అందించడమే లక్ష్యం

- నిర్వీర్యమైన ప్లాంట్ల పునరుద్ధరణకు చర్యలు
- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ఇందుకోసం జల్‌జీవన్ మిషన్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగిస్తామన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ప్రజలకు ఇంకా సురక్షిత నీరు అందకపోవడం చాలా బాధాకరమన్నారు. శాసనసభలో బుధవారం ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకంపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, కోండ్రు మురళీమోహన్, ముత్తముల అశోక్‌రెడ్డి, గౌతు శిరీష, పుట్టా సుధాకర్ యాదవ్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. తమ నియోజకవర్గాల్లో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం ఆర్‌ఓ ప్లాంట్లు అత్యధిక శాతం పనిచేయడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్, పంచాయతీరాజ్ ద్వారా సరఫరా చేస్తున్న నీటికి సంబంధించి వాటర్ పైపులైన్లు తుప్పుపట్టి పోయాయని, ఫలితంగా కలుషిత నీరు కలుస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు అందక కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా అనేక మంది మారుతున్నారని, ప్రభుత్వం తక్షణమే ఆర్‌ఓ ప్లాంట్లు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందిస్తూ.. తిరువూరు, ఉద్దానం, కనిగిరి, ఉదయగిరి సహా పలు ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం కింద 6 జిల్లాల్లో ఒక హబ్, స్పోక్ విధానంలో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో శ్రీకాకుళం, చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు పాక్షికంగా పనిచేస్తున్న మాట నిజమేనని, శ్రీసత్యసాయి జిల్లాలో మాత్రం పూర్తి స్థాయిలో ప్లాంట్లు పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఆయా జిల్లాల్లో 45 మదర్ ప్లాంట్లను నెలకొల్పామని, వీటిలో 25 మదర్ ప్లాంట్లు పనిచేసే స్థితిలో ఉన్నాయన్నారు. మరో 20 ప్లాంట్లు నిర్వీర్యమైపోయాయన్నారు. 7 జిల్లాల్లో 878 రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఆర్‌డియు) నెలకొల్పామన్నారు. ఇందులో 215 రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఆర్‌డియు) పనిచేస్తుండగా, 663 నిర్వీర్యమైపోయాయన్నారు. నిర్వీర్యమైపోయిన ప్లాంట్లను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల నుంచి ప్లాంట్ల పునరుద్ధరణకు అంచనాలు అందాయని, శ్రీకాకుళం, నంద్యాల పునరుద్ధరణకు అంచనాలు తయారవుతున్నాయని తెలిపారు.

మండల కేంద్రాల్లో జన ఔషధి కేంద్రాలు

- జనరిక్‌పై ప్రజల్లో అవగాహన తక్కువ ఉన్న మాట నిజమే
- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మండల కేంద్రాల్లో ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాల్ని ప్రారంభించడం ద్వారా యువతకు ఉపాధి కల్పించవచ్చనే ఉద్దేశంతో సిఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పేదలకు వైద్య ఖర్చు తక్కువ ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా సభ్యులు బెందాళం అశోక్, రెడ్డప్పగారి మాధవి, మహ్మద్ నజీర్, కె మురళీమోహన్ మాట్లాడతూ.. జనరిక్ ఔషధాల పట్ల ప్రజల్లో అవగాహన లేదని, ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

జనరిక్ మందులు అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రవేశపెట్టాలన్నారు. వీటిపై మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో ప్రత్యేకంగా 325 జనరిక్ మందుల దుకాణాలుండగా, అందులో ప్రధాన మంత్రి జనౌషధి కేంద్రాలు 215, అన్న సంజీవని 783, ఎన్‌జిఒలు, ఇతర సంస్థలు నడుపుతున్నవి మరో 37 ఉన్నాయన్నారు. జనరిక్ మందుల గురించి ప్రజల్లో అవగాహన తక్కువగా ఉన్న మాట నిజమేనని, ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్లు కూడా జనరిక్ మందులు రాయడం లేదని మంత్రి తెలిపారు. జనరిక్ మందుల్లోని పదార్థాలు, డోసేజ్, పనితీరు బ్రాండెడ్ మందులతో సమానంగా ఉంటాయనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో రూ.10 వేలకోట్ల విలువజేసే మందుల విక్రయాలు జరుగుతుండగా, అందులో కేవలం 7 శాతమే జనరిక్ మందుల అమ్మకాలు సాగుతున్నాయన్నారు. 560 రకాల అనుమతి పొందిన అత్యవసర మందుల జాబితా ప్రకారం జనరిక్ మందులను సేకరించి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జనరిక్ మందుల నాణ్యత గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐఇసి-ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

'డిఎస్‌సి'పై పిడిఎఫ్ వాయిదా తీర్మానం

- వైద్య రంగంపై వైసిపి
- తిరస్కరించిన ఛైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సి నోటిఫికేషన్‌పై చర్చించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర ఎమ్మెల్సీ పి రఘువర్మ శాసనమండలిలో ఛైర్మన్ కె మోషేను రాజుకు వాయిదా తీర్మానం అందించారు. బుధవారం మండలి ప్రారంభం కాగానే ఈ అంశంపై చర్చించాలని పట్టుబట్టగా.. వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తొలి సంతకం డిఎస్‌సిపై చేశారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు దీనిపై రోడ్డు మ్యాప్ ప్రకటించలేదన్నారు. సిలబస్ కూడా ఇప్పటి వరకు ప్రకటించలేదని ఛైర్మన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అభ్యర్థులకు వయోపరిమితి కూడా పెంచాలని కోరారు. కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలన్నారు. విద్యాశాఖ మంత్రి ఇక్కడే ఉన్నారని, ఈ అంశాలపై సమాధానం చెప్పాలని కోరారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ, ఆరోగ్యశ్రీ, వైద్యారోగ్య రంగాలపై చర్చించాలని కోరుతూ వైసిపి సభ్యులు అరుణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, రవీంద్రబాబు మరో వాయిదా తీర్మానం అందించారు. దీనిని కూడా తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ వెల్లడించారు.

పేదలపై బ్రహ్మాస్త్రం

- భూ దురాక్రమణ చట్టంపై రౌండ్‌టేబుల్‌లో వక్తల ఆగ్రహం
- దళితులు, బలహీనవర్గాలను అణచివేసే చర్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన ఆంధ్రప్రదేశ్ భూ దురాక్రమణ (నిషేధ) చట్టం పేదలపై బ్రహ్మాస్త్రమని, దీనివల్ల పేదలు నష్టపోతారని, పెట్టుబడిదారులు, పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు మరింత దోపిడీకి దిగుతారని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ భూ దురాక్రమణ చట్టం ఎవరి ప్రయోజనాల కోసం అనే అంశంపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన బుధవారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చట్టంపై ప్రత్యేక తీర్మానాన్ని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో పేదలకు భూములు ఇచ్చేవారని, ఇప్పటి పాలకులు ఆ భూములను లాక్కుంటున్నారని, దీనికోసం చట్టాలు చేస్తున్నారని అన్నారు. కొత్తగా తీసుకొచ్చిన చట్టంలో పెద్దలు ఎవరైనా దురాక్రమణ చేస్తే వారిపై ఎటువంటి చర్యలూ ప్రస్తావించలేదని, పేదల ఆక్రమణలో ఉన్న భూములపైనే ప్రభుత్వం దృష్టంతా ఉన్నట్లు కనిపించిందని అన్నారు. ఇలాంటి తప్పుడు చట్టాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పట్టణీకరణ, వ్యాపారీకరణ, పారిశ్రామికీకరణ ప్రాథమిక అవసరాల పేరుతో భూములు లాక్కుంటున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రైవేటు వ్యక్తుల భూములను దౌర్జన్యంగా ఆక్రమంగా పలుకుబడి కలిగినవారు ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటే ప్రజాసంఘాలు, నాయకులు హర్షిస్తారని, కానీ పేదలపైనే చర్యలు తీసుకునేలా చట్టం ఉందని తెలిపారు. గ్రామాల్లో రెండున్నర ఎకరాలు మాగాణి, ఐదెకరాల మెట్ట కలిగిన పేదలకు, మధ్యతరగతి రైతులు, పట్టణాల్లో తలదాచుకోవడానికి సొంత స్థలం లేని పేద, మధ్యతరగతి ప్రజలు ఐదు సెంట్ల స్థలం కలిగి ఉంటే వారికి ఈ చట్టం నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఇలాంటి చట్టం తీసుకొస్తే



సమావేశం లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, వేదికపై కె రామకృష్ణ , దడాల సుబ్బారావు తదితరులు

పోరాటాలు నిర్వహించడంతో వెనక్కు తగ్గిందని, ఇప్పుడు టిడిపి ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు మాట్లాడుతూ.. పరిశ్రమలు పేరుతో భూములు లాక్కుంటున్నా అక్కడ పరిశ్రమలు పెట్టకపోగా భూములను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇప్పటికే చాలాచోట్ల సేకరించిన భూమి మిగిలి ఉండగానే అదనంగా భూమి సేకరించే పనులకు దిగుతున్నారన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. చట్టం తీసుకురావడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. చట్టాలు ప్రజలను రక్షించేవిగా ఉండాలని, భక్షించేవిగా ఉండకూడదని తెలిపారు.

ఈ చట్టం పేదలు, ముఖ్యంగా దళితులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. సిపిఐఎంఎల్ రాష్ట్ర నాయకులు హరినాథ్ మాట్లాడుతూ.. దుర్మార్గమైన ఈ చట్టాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాలన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు పొలారి, డివైఎఫ్ఐ నాయకులు రాము, బికెఎంయు నాయకులు కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివనాగరాణి మాట్లాడారు. అనంతరం వెంకటేశ్వర్లు పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. దీనిలో సెక్షన్2 (డి,ఇ), సెక్షన్ 4(1), సెక్షన్ 5(4), సెక్షన్ 6(1)ను ఎత్తేయాలని కోరారు. గడిచిన నాలుగు దశాబ్దాలను పరిశీలిస్తే కాంగ్రెస్, తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు ఒక్క అనర్హుడిపైనా చర్య తీసుకోలేదని, ఒక్క దళితుడికి భూమి తిరిగి అప్పజెప్పలేదని పేర్కొన్నారు. తీసుకొస్తామన్న చట్టం పరిశీలిస్తుంటే పట్టణీకరణ పెరగడం, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక అభివృద్ధి పేరుతో నగరాలకు, మండల కేంద్రాలకు అనుకున్న ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో విలువైన భూములను బడా పెట్టుబడిదారులకు, సంపన్నులకు రాజకీయ నాయకులు కట్టబెట్టేందుకు గుజరాత్ తరహాలో చట్టం చేస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. దళితులు, బలహీనవర్గాల ప్రభుత్వమని చెబుతూ వారిని అణచివేసే చర్యలు తీసుకోవడం సరైంది కాదని అన్నారు. దీనిపై అనర్హులు ఎంతటి గొప్పవారైనా భూ ఆక్రమణలు చేసిన వారిని శిక్షించాలని, అప్పుడే ప్రజలు హర్షిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట కల్యాణ్, తాళ్లూరి నరసింహారావు, మాతంగి ఆంజనేయులు, సట్టు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ నగరంలో న్యాయ విద్యార్థినిపై ప్రేమ పేరుతో నయవంచన చేసి దారుణంగా అత్యాచారం చేశారని, ఈ ఘటన నాగరిక ప్రపంచాన్ని సిగ్గుతో తలదించుకునేట్లు చేసిందని తెలిపారు. ఒక లా విద్యార్థిని ఈ అమానుషత్వాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక ఆత్మహత్యయత్నానికి సిద్ధపడిందంటే ప్రభుత్వ, పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకం లేనిస్థితి కనిపిస్తోందని పేర్కొన్నారు.

తిరుపతి జిల్లాలో మూడేళ్ల చిన్నారిని చిదిమేసిన ఘటన మరువకముందే ఈ ఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజూ మహిళలు, పిల్లలపై దాడులు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నా పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం గర్హనీయమని తెలిపారు. నిందితులకు సరైన శిక్ష పడకపోవడం, జాప్యం జరగడం వల్ల మరింత పెట్రేగిపోతున్నారని వివరించారు. ఈ ఘటనలో బాధిత విద్యార్థినికి, వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించే చర్యలు తీసుకోవాలని, అఘాయిత్యం చేసిన దుర్మార్గులను శిక్షించి సత్వర న్యాయం చేసే విధంగా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. యువతలో ఇలాంటి ఘటనలపై సామాజిక స్పృహను పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టాలని డిమాండు చేశారు. మహిళలు, విద్యార్థులు సంఘటితమై ఇలాంటి ఆకృత్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

ఖాళీ పోస్టుల వివరాలు సేకరిస్తున్నాం

- మంత్రి పయ్యావుల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరిస్తున్నామని వైసిపి సభ్యులు తూమాటి మాధవరావు, రమేష్ యాదవ్, పి వరాహ వెంకటసూర్య నారాయణరాజు క్వశ్చన్ అవర్‌లో భాగంగా అడిగిన ప్రశ్నకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానం చెప్పారు. 2014 నుంచి 2024 వరకు 1,81,208 ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. వీటిల్లో గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శుల పోస్టులు 1,18,359 ఉన్నాయని చెప్పారు. సాధారణ పోస్టులను గత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఎక్కువగా భర్తీ చేయలేదన్నారు. అన్ని శాఖల్లో 50 శాతం వరకు ఖాళీలున్న విషయం వాస్తవమేనని మాధవరావు అడిగిన అనుబంధ ప్రశ్నకు చెప్పారు. టిడ్కో గృహాల కోసం 2019-24 మధ్య రాష్ట్ర ప్రభుత్వం రూ.3,175.61 కోట్లు రుణంగా తీసుకుందని టిడిపి సభ్యులు తిరుమల నాయుడు, దువ్వారపు రామారావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ సమాధానం చెప్పారు. గత ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసిందని చెప్పారు. లబ్ధిదారుల సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. కడప మాజీ ఆర్‌జెడి రాఘవరెడ్డిపై అవినీతి, ఆరోపణలొచ్చిన విషయం వాస్తవమేనని భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. 45 రోజులుగా విచారణ పూర్తిచేసి చర్యలు తీసుకుంటామన్నారు.

హాస్టళ్ల శానిటేషన్ ప్రైవేటుకు : మంత్రి డోలా

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యాన నడుస్తున్న హాస్టళ్ల పారిశుధ్య నిర్వహణ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన చేస్తున్నామని వైసిపి సభ్యులు వంకా రవీంద్రనాథ్ అడిగిన ప్రశ్నకు ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. రాత్రి సమయంలో పోలీస్ గస్తీ, 24 గంటల భద్రతా సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు ఒక వైద్య అధికారిని నియమిస్తామన్నారు.

సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

- మండలి 'ప్రత్యేక ప్రస్తావన'లో కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్లలో పనిచేస్తున్న 10,035 మంది సిహెచ్‌ఒల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు కోరారు. శాసనమండలిలో బుధవారం 'ప్రత్యేక ప్రస్తావన'లో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. వీరికి ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.25 వేల జీతం, పెర్ఫార్మెన్స్ బేస్ ఇన్సెంటివ్ రూ.15 వేలు కలిపి, రూ.40 వేలు ఫిక్స్‌డ్ కాన్సాలిడేటెడ్ పేగా మార్చాలని, గత 8 నెలలుగా ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ బకాయిల్లో కోతలు పెడుతున్నారని చెప్పారు. వీరికి ఇపిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, రెగ్యులర్ చేసేందుకు మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు.

- వివిధ ప్రభుత్వ శాఖల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 15 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని పిడిఎఫ్ సభ్యులు ఐ వెంకటేశ్వరరావు కోరారు. వైద్యారోగ్య, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఆప్‌కాస్ ద్వారా చేసిన 1,500 మందికి వేతనాలు అందడం లేదన్నారు. ఆప్‌కాస్ లాగిన్స్ క్లోజ్ చేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని, వెంటనే వీటిని ఓపెన్ చేసి ఉద్యోగుల వివరాలు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.
- జెఎన్‌టియు విజయనగరానికి కేటాయించిన 21 మంది ప్రొఫెసర్లు ఇక్కడ పనిచేయకుండా, జెఎన్‌టియు కాకినాడలో పనిచేస్తున్నారని పాకలపాటి రఘువర్మ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనివల్ల ఇక్కడి విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా కాకినాడలోనే పనిచేస్తున్నారని చెప్పారు. వీరిని వెనక్కి రప్పించి విజయనగరంలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- బిఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు ఏజెన్సీల నుంచి చెల్లించడం వల్ల వారికి తక్కువ మొత్తంలో ఇవ్వడం, ప్రతినెలా జీతాలు అందడం లేదని పి రామసుబ్బారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సకాలంలో వారికి రావాల్సిన వేతనాలు, సరైన మొత్తంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేసేందుకు ఎస్ఆర్ శంకరన్ జిఓ 3ను 1986లో విడుదల చేశారని, 2001లో సుప్రీంకోర్టు ఈ జిఓను కొట్టేసిందని, దీనివల్ల గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కుంభా రవిబాబు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం ఆర్టికల్ 270(డి)ని సవరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఈ చర్యలను కొనసాగించి గిరిజనులకు న్యాయం చేసేలా కృషి చేయాలని కోరారు.
- కర్నూలులో లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, ఎపిఇఆర్‌సి, వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ వంటి సంస్థలను గత ప్రభుత్వం ఏర్పాటుచేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఈ సంస్థలను ఇక్కడి నుంచి తొలగిస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నట్లు ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ అంశంపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కర్నూలులో న్యాయ విద్యాలయం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశాన్ని తెలియజేయాలని కోరారు.
- అర్హులైన జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకులు 4,008 మందిని వెంటనే క్రమబద్ధీకరించాలని టి కల్పలత ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు జిఓ నెంబరు 114 జారీ చేసిందని, వైద్యారోగ్యశాఖ ఉద్యోగులను మాత్రమే ఇప్పటి వరకూ క్రమబద్ధీకరించిందని తెలిపారు.
- వడ్డెర కులాన్ని ఎస్‌టిలుగా గుర్తించాలని, వీరికి తగిన రాయితీలు కల్పించాలని ప్రభుత్వాన్ని చంద్రగిరి ఏసురత్నం కోరారు. ఎరుకల, యానాది, లంబాడి, వడ్డెర కులాల్లో వడ్డెరను మినహాయించి మిగిలిన మూడు కులాలను ఎస్‌టిలుగా గుర్తించారన్నారు. దీంతో వడ్డెర కులస్తులకు అన్యాయం జరుగుతుందన్నారు.
- పశుసంవర్ధక శాఖలో ఉన్న మినీ గోకులం పథకాన్ని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ కేటాయించాలని వంకా రవీంద్ర కోరారు. ప్రస్తుతం ఒక గ్రామంలో ఇద్దరికే కేటాయిస్తున్నారని, దీనివల్ల మిగిలిన పశుపోషకులు ఈ పథకాన్ని పొందలేకపోతున్నారని చెప్పారు. గ్రామ సభలు పెట్టి అసలైన లబ్ధిదారులకే పథకాన్ని కేటాయించాలన్నారు.
- వైద్యులు, ఆస్పత్రులు మీద దాడులు జరిగితే నాన్ బెయిలబుల్ అరెస్టు చేసేందుకు ప్రభుత్వం చట్టం చేసిందని సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. అప్పటి చట్టం ప్రకారం నాన్ బెయిలబుల్ అరెస్టు మూడేళ్లు ఉండేదని, ప్రస్తుతం నాన్ బెయిలబుల్ అరెస్టు కాలపరిమితిని ఏడేళ్లకు సుప్రీంకోర్టు పెంచినందున చట్టంలో కూడా మార్పు చేయాలని కోరారు.



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు నుంచి కోర్టుల తరలింపు తగదు

- హిందూపురంలో న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - హిందూపురం

కర్నూలు నుంచి లోకాయుక్త, మానవ హక్కుల న్యాయస్థానాల తరలింపునకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. బుధవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమైన న్యాయవాదులు మూడు రోజులపాటు విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కర్నూలులోనే హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందు కోసం ఈ నెల 22 వరకు విధులు బహిష్కరించి నిరసన చేపడుతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీ కట్టాల్సిందే

- అవసరమైతే నిరవధిక నిరాహార దీక్ష
- విభజన హామీలు అమలు కాకపోవడానికి బిజెపియే కారణం : షర్మిల
- కలెక్టరేట్ వద్ద టెంకాయ కొట్టి నిరసన

ప్రజాశక్తి- కడప

వైఎస్ఆర్ జిల్లా ప్రజల చిరకాల కోర్కెైన కడప ఉక్కు పరిశ్రమను కట్టాల్సిందేనని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమ బాట పడతామని, అవసరమైతే నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ శంకుస్థాపనలకే పరిమితమైందని, ముఖ్యమంత్రులు మారడం, టెంకాయ కొట్టడమే తంతుగా మారిందని వివరించారు. కడపకు బుధవారం వచ్చిన ఆమె కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి కడప స్టీల్‌ప్లాంట్‌పై వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో టెంకాయ కొట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆ తర్వాత మీడియాతో షర్మిల మాట్లాడారు.



టెంకాయ పట్టుకుని మీడియాతో మాట్లాడుతున్న షర్మిల

కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేస్తామని, నిరవధిక నిరాహార దీక్షకూ వెనుకాడబోమని చెప్పారు. కడప ఉక్కు పరిశ్రమకు చంద్రబాబు, జగన్ టెంకాయలు కొట్టి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీలు అమలు కాకపోవడానికి బిజెపియే కారణమన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ పెట్టాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉందని గుర్తు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కూడా ఇవ్వబోమని కేంద్రం చెప్పడం శోచనీయమన్నారు. అటువంటి బిజెపి ప్రభుత్వానికి గత పదేళ్ల నుంచి చంద్రబాబు, జగన్ మద్దతు ఇస్తున్నారని, సిగ్గు లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప ఉక్కు పరిశ్రమకు గత ముఖ్యమంత్రి జగన్ రెండుసార్లు శంకుస్థాపని చేశారని, ఈ సందర్భంగా ఆయన ఆస్కార్ డైలాగులు చెప్పారని విమర్శించారు. ఐదేళ్లు ముఖ్యంత్రిగా జగన్ ఉండి కూడా వైఎస్ఆర్ కలైన కడప ఉక్కు పరిశ్రమ ఎందుకు కట్టలేదని నిలదీశారు. ఇప్పుడు ఓడిపోయి కడప జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేగా ఉన్న జగన్ ఎందుకు అసెంబ్లీకి వెళ్లడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం, సూపర్ సిక్స్ హామీలు, ఇతర ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీకి వెళ్లి ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తాననడం సరికాదన్నారు. పదేళ్లుగా కడప ఎంపిగా ఉన్న వైఎస్.అవినాష్‌రెడ్డి కడప ఉక్కు పరిశ్రమ కోసం ఎన్నిసార్లు మాట్లాడారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

అవినాష్‌రెడ్డిని ఎందుకు అరెస్టు చేయడం లేదు?

తనపైనా, తన తల్లి విజయమ్మపైనా, తన సోదరి సునీతపైనా సోషల్ మీడియాలో కడప ఎంపి అవినాష్‌రెడ్డి ఆదేశాలతోనే వర్రా రవీందర్‌రెడ్డి అసభ్యకర పోస్టులు పెట్టారని తేలిందని షర్మిల చెప్పారు. అయినా, అవినాష్‌రెడ్డిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయడంలేదని ప్రశ్నించారు. సజ్జల భార్గవరెడ్డిని కూడా ఎందుకు అరెస్టు చేయడంలేదో సమాధానం చెప్పాలన్నారు. పోస్టులు పెట్టేవారినే కాదు... పోస్టులు పెట్టేలా ప్రేరేపించే వారినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి
- పార్వతీపురం మన్యం కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-పార్వతీపురం


విశాఖలో న్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనను నిరసిస్తూ, నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పని ప్రదేశాల్లో మహిళలకు, విద్యార్థులకు రక్షణ కరువైందని, ఈ భద్రత వైఫల్యాలకు బాధ్యత టిడిపి కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కొల్‌కత్తా ట్రైనీ డాక్టర్ ఘటన మరువకముందే లా విద్యార్థిపై క్రూరమైన దాడి జరగడం అమానుషమని అన్నారు. మహిళలపై దాడులకు విశాఖపట్నం అడ్డాగా మారుతుందని విమర్శించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలకు యువత బానిసై మహిళలపై పాశవిక, లైంగిక దాడులకు పాల్పడుతున్నారని, వెంటనే వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బారావమ్మ మాట్లాడుతూ... ఏదో ఒకచోట ప్రతిరోజు మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, మద్యం ఇసుక మాఫియాలపై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై లేదని విమర్శించారు. మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని, పోర్న్ వెబ్ సైట్లను రద్దు చేయాలని, పోక్సో చట్టం ద్వారా వెంటనే విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జస్టిస్ వర్మ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం.ఉమామహేశ్వరి, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

25న వర్మ విచారణకు హాజరవ్వాలి

- నోటీసులు పంపిన ఒంగోలు రూరల్ సిఐ

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)

సోషల్ మీడియా కేసులో ముద్దాయిగా ఉన్న ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ ఈ నెల 25న స్వయంగా విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపినట్లు ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్‌బాబు బుధవారం తెలిపారు. ఈ నెల పదిన మద్దిపాడు పోలీస్‌స్టేషన్లో రామ్‌గోపాల్‌వర్మపై సోషల్ మీడియా కేసు నమోదయిందన్నారు. ఆ కేసులో భాగంగా ఈ నెల 19న విచారణకు హాజరు కావాల్సి ఉండగా వర్మ తరపు లాయర్ వారం రోజులు గడువు కావాలని కోరినట్లు చెప్పారు. ఈ నెల 25న ఒంగోలులోని తన కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని వర్మకు వాట్సప్ ద్వారా నోటీసులు పంపినట్లు సిఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు.


కియోస్క్ మిషన్లు ప్రారంభిస్తున్న టిటిడి అడిషనల్ ఈవో వెంకయ్య

'అన్నప్రసాదం' విరాళానికి కియోస్క్ మిషన్లు

ప్రజాశక్తి- తిరుమల

ఎస్‌వి అన్న ప్రసాదం ట్రస్టుకు విరాళం ఇచ్చేందుకు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో కియోస్క్ మిషన్‌ను టిటిడి ఏర్పాటు చేసింది. టిటిడి అడిషనల్ ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి బుధవారం దీనిని ప్రారంభించారు. టిటిడికి ఈ మిషన్‌ను విరాళంగా కెనరా బ్యాంకు అందించింది. ఈ మిషన్ల ద్వారా సందర్శకులు ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్టుకు సులభతరంగా విరాళం అందిచవచ్చు. రూ.1 నుండి రూ.99,999 వరకు తమకు తోచిన మొత్తాన్ని సందర్శకులు కియోస్క్ మిషన్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యుపిఐ ద్వారా విరాళం ఇవ్వవచ్చు. ఈ సందర్భంగా అడిషనల్ ఇఒ మీడియాతో మాట్లాడుతూ టిటిడిని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కియోస్క్ మిషన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు లోకనాథం, రాజేంద్ర, కెనరా బ్యాంకు డిజిఎం రవీంద్ర అగర్వాల్, ఎజిఎం నాగరాజురావు, తిరుమల బ్రాంచ్ మేనేజర్ రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికశాఖలో బాధ్యతల పంపకాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థికశాఖలోని ముఖ్య అధికారులకు వివిధ శాఖల బాధ్యతలను కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ ఆ శాఖకు అధిపతిగా ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ (పిఎఫ్ఎస్)గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఇతర కార్యదర్శులతో సమన్వయకర్తగా, రాష్ట్ర విధానాల్లో ఆర్థిక పాత్ర, శాసన, మంత్రిమండలి నిబంధనలు, విదేశీ పర్యటనలు, రాష్ట్ర అభివృద్ధి సంస్థలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కార్యదర్శి ఎం. జానకికి కేంద్రం నుంచి వచ్చే నిధులు, రాష్ట్ర పథకాలకు కేంద్ర నిధులు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల అంశాలు, రాష్ట్ర విభజన అంశాలతోపాటు వ్యయ విభాగం, ప్రభుత్వ శాఖలకు సంబంధించి సంక్షేమం, కార్మిక, గృహ నిర్మాణం, పాఠశాల విద్య, ఉన్నత విద్య, హెూమ్, న్యాయస్థానాలు, న్యాయశాఖ, గ్రామ, వార్డు సచివాయాలు, పశు సంవర్ధకశాఖ, మత్స్యశాఖ, పౌర సరఫరాలు, డెయిరీ డెవలప్‌మెంట్, విధానాలు, ఉద్యోగ నియామకాల్లో 1994, 1997 చట్టాల అమలు, పోస్టుల స్థాయి పెంపు, పింఛన్లు, జిపిఎఫ్, ఉద్యోగుల సంక్షేమం, వేతన సవరణ కమిషన్, పే అండ్ అక్కౌంట్స్ శాఖలను అప్పగించారు. మరో కార్యదర్శి రోనాల్డ్‌రోస్‌కు కీలకమైన బడ్జెట్ బాధ్యతను అప్పగించారు. దీనితో పాటు నగదు నిల్వ, సంస్థాగత ఆర్థికం, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి, జనరల్ ఇన్సూరెన్స్, ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు, నబార్డ్, ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం పనులు, సిఎఫ్ఎంఎస్, అంతర్గత ఆడిట్‌లను అప్పగించారు. సాధారణ పరిపాలనశాఖ, సర్వే స్టాటస్టిక్స్, క్రీడలు, పర్యాటకం, యువజన, మౌళికాభివృద్ధి, పెట్టుబడులు, విద్యుత్, పరిశ్రమలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, రవాణా, ఆర్ అండ్ బి విభాగాలను కూడా రోస్‌కు అప్పగించారు. అదనపు కార్యదర్శి హెూదాలో ఉన్న ఐఎఎస్ అధికారి నివాస్‌కు రాష్ట్ర సొంత ఆర్థిక వనరులు, ఆదాయ వనరుల శాఖలు, డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్, ఆదాయ సముపార్జన కేటాయించగా, వైద్య ఆరోగ్యం, మున్సిపల్ పట్టణాభివృద్ధి, అటవీ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అంశాలను అప్పగించారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పరిగి (సత్యసాయి జిల్లా)


ఆదినారాయణ (ఫైల్)

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు... పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ (45) గత 15 ఏళ్లుగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెల వివాహం కోసం రూ.ఐదు లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే మగ్గం వృత్తిలో ఆదాయం లేకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీ భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి, అప్పులు తీరే దారిలేకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నాం

లంచం తీసుకుంటూ పట్టుబడిన డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లంచం తీసుకుంటూ ఒంగోలు వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి రామచంద్రరావు వివరాల మేరకు.. నగరంలోని ఓ ట్రేడింగ్ కంపెనీకి సంబంధించి డిఏసి నోటీసు ఇచ్చి వాణిజ్య పన్నుల శాఖలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా కెఎస్.శ్రీనివాస్‌ప్రసాద్ పెనాల్టీ విధించారు. పెనాల్టీ లేకుండా చేసేందుకు రూ.1.50 లక్షలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ట్రేడింగ్ కంపెనీ యజమాని శ్రీధర్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు కమిషనర్‌కు శ్రీధర్ లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎసిబి డిఎస్‌పి తెలిపారు.


విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ఉద్యోగ భద్రత కల్పించాలి

- పలు జిల్లాల్లో విఒఎల ఆందోళన

ప్రజాశక్తి-యంత్రాంగం

విఒఎల మెడపై కత్తిలా ఉన్న మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరుతూ వెలుగు విఒఎలు బుధవారం ఆందోళనకు దిగారు. కనీస వేతనం, బకాయి వేతనాలు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన పలు జిల్లాల్లోని కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వం తెచ్చిన మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలో సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటిడిఎ వద్ద ధర్నా చేశారు. చింతూరు, పాడేరులో ర్యాలీలు చేపట్టారు. శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బి బంగ్లా రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ స్వప్నికల్ దినకర్‌కు వినతిపత్రం అందజేశారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరుతూ ధర్నా చేశారు. నంద్యాలలో నూనెపల్లె ఫ్లై ఓవర్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి డిఆర్ఒ రామ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కర్నూలు, సత్యసాయి జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట నిరసన తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విఒఎలు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం అందించారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏలూరు, నెల్లూరు, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేశారు.

విద్యుత్ తీగలు తెగి పడి... తండ్రీకుమారుడు మృతి

ప్రజాశక్తి- యల్లనూరు, పుట్లూరు

విద్యుత్ తీగలు మీదపడి తండ్రీకుమారుడు మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లాల్లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామానికి చెందిన తలారి రామాంజినేయులు (40) వ్యవసాయ కార్మికుడు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం తన కుమారుడు రవి (13)తో కలిసి కడప జిల్లా లింగాల మండలం అంకెవారిపల్లి గ్రామంలో తన బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో రామాంజినేయులు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా యల్లనూరు మండలం దంతాలపల్లి గ్రామం వద్ద వ్యవసాయ విద్యుత్ 11కెవి ఇన్సులేటర్ కాలిపోయి తీగలు తెగిపడ్డాయి. తండ్రీకుమారుడిపై ఆ తీగలు పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ఇద్దరూ మరణించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన వర్సిటీని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ


కుంటినవలసలో నిర్మాణంలో ఉన్న గిరిజన యూనివర్సిటీ పనులను పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/ మెంటాడ

గిరిజన యూనివర్సిటీ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, గిరిజన యూనివర్సిటీని కొత్తవలస వద్ద రెల్లి గ్రామానికి మారుస్తామని మంత్రి లోకేష్ అసెంబ్లీలో చేసిన ప్రకటనను విరమించుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలసలో నిర్మాణంలో ఉన్న గిరిజన యూనివర్సిటీ పనులను అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, ఉపాధ్యక్షులు కె.విజయగౌరి, గిరిజన సంఘం మన్యం జిల్లా కార్యదర్శి సీదిరి అప్పారావు తదితరులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్‌ను కలిసి పనులపై చర్చించారు. అనంతరం అజశర్మ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా వర్సిటీ స్థలాన్ని మార్చడంతో నేటికీ మెంటాడ మండలం కుంటినివలస వద్ద నిర్మాణ ప్రారంభ దశలోనే ఉందన్నారు. నేడు మళ్లీ దీన్ని కొత్తవలస మండలం రెల్లి గ్రామం వద్ద గతంలో సేకరించిన స్థలంలోనే నిర్మిస్తామని ఈ నెల 13న రాష్ట్ర అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ ప్రకటించారన్నారు. దీనివల్ల ఇది మరింత ఆలస్యం కావడం తప్ప మరొకటి కాదన్నారు. గత ప్రభుత్వం రెల్లి గ్రామం నుంచి కుంటినవలసకు మార్చిందని తెలిపారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్థలాలు మార్చడం సరికాదన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న వర్సిటీని మార్చడం అవివేకమని పేర్కొన్నారు. మంత్రి లోకేష్ తన నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి కుంటినవలసలోనే వర్సిటీని నిర్మించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖలు రాసినట్లు తెలిపారు. వర్సిటీని యుద్ధ ప్రాతిపదికన 2025లోగా పూర్తి చేయాలని, శాశ్వత సిబ్బందిని నియమించి, అన్ని కోర్సులనూ అందుబాటులోకి తేవాలని, గిరిజనులకు 50 శాతం సీట్లు కేటాయించేలా చట్టబద్ధ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దిశలో రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి టి. సోములు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము, నాయకులు జగదీష్, రవికుమార్, కాంతారావు, గ్రామ సర్పంచి రమేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఎం అరెస్ట్‌తో ఉలిక్కిపాటు

- వాల్తేరు రైల్వేలో నాణ్యత లేని పనులు
- పక్కా ట్రాక్ రికార్డుతోనే అధికారి అరెస్ట్!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రైల్వేల చరిత్రలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రాజెక్టుల పనుల్లో బడా కాంట్రాక్టర్లను భాగస్వామ్యం చేసిన నేపథ్యంలో డిఆర్ఎం స్థాయి అధికారులు సిబిఐకి దొరికిపోవడం వరసగా రాష్ట్రంలో రెండు చోట్ల జరిగాయి. వాల్తేరు రైల్వేలో మెకానికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యాన సాగే రూ.వందల కోట్ల ప్రాజెక్టు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేయడం, జరిమానా విధించడం జరగడంతో బడా కాంట్రాక్టర్లతో వాల్తేరు రైల్వే అధికారి లాలూచీ పడిన వైనం బట్టబయలైంది. వాల్తేరు రైల్వే డివిజన్ చరిత్రలో తొలిసారి, ఆంధ్రప్రదేశ్‌లో రెండోసారి డిఆర్ఎం స్థాయి రైల్వే అధికారులు ఇద్దరు అవినీతి, లంచగొండి వ్యవహారంలో కూరుకుపోయి సిబిఐకి చిక్కిన ఘటనలు చోటుచేసుకోవడంతో రైల్వే యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడినట్టయింది. వాల్తేరు రైల్వే డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ముంబయిలోని ఒక హోటల్‌లో రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ఈ నెల 16న సిబిఐకి చిక్కిన వ్యవహారంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఏడాది జులైలో రాష్ట్రంలోని గుంతకల్ డివిజన్ డిఆర్ఎం కూడా ఇలానే సిబిఐకి చిక్కారు.

వాల్తేరు డిఆర్ఎంపై అభియోగం ఏమిటి?

వాల్తేరు డిఆర్ఎం రూ.25 లక్షలు డిమాండ్ చేశాడని అభియోగం. ప్రాజెక్టు పనిలో నాణ్యత లేకపోవడంతో ఫైలు కొద్దిరోజుల క్రితం ఆగిపోయింది. సదరు ఫైలుకు సుమారు రూ.5 కోట్లు జరిమానా పడింది. ముంబయి కాంట్రాక్టర్లు రంగంలోకి దిగి డిఆర్ఎంతో చర్చలు జరిపినట్లు సమాచారం. దీంట్లో కేంద్రంలోని బిజెపి బడా కాంట్రాక్టర్ల భాగస్వామ్యం ఉందన్నది వాల్తేరు రైల్వేలో తాజాగా చర్చ సాగుతోంది. పర్సంటేజీ ఇస్తేనే బిల్లు పాస్ అవుతుందని డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్ చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. జరిమానా బిల్లు కూడా ఈ చర్చల్లో భాగంగా డిఆర్ఎం బాగా తగ్గించేసినట్లు సమాచారం. రూ.4 కోట్ల నుంచి సుమారు రూ.2 కోట్లకు తగ్గించేశారు. ముంబయి వస్తే రూ.25 లక్షలు చెల్లిస్తామని కాంట్రాక్టరు చెప్పడంతో డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ముంబయి వెళ్లి హోటల్‌లో లంచం తీసుకున్నట్లు తెలుస్తోంది. సిబిఐ అధికారులు పక్కా వ్యూహంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

డిఆర్ఎంపై ఫిర్యాదులు

వాల్తేరు రైల్వే డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌పై ఈస్ట్ కోస్ట్ రైల్వే విభాగం మార్కెటింగ్ యజమాని సునీల్ రాథోడ్ ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు ఆనంద్ భగత్ అనే వ్యక్తి హెచ్‌ఆర్‌కె సొల్యూషన్స్ పూణెకు చెందిన వారు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. హిందుస్తాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ లిమిటెడ్, (వడోదర గుజరాత్)పైనా కొంతమంది సిబిఐకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. సిబిఐ ఎస్‌పి ఢిల్లీకి చెందిన సుమన్ కుమార్ ఈ నెల 18న పైన తెలిపిన వారిపై (డిఆర్ఎం సహా) కేసులు బుక్ చేశారు.

పక్కాగా ఫిర్యాదులండబట్టే అరెస్టు

రైల్వేలో ఉన్నతాధికారులపై కేసులు, అరెస్టులు అప్పటికప్పుడే జరగవని వాల్తేరు రైల్వే ఉద్యోగుల్లో తాజాగా చర్చ సాగుతోంది. రైల్వే బోర్డుకు చెందిన రైల్వే సెంట్రల్ విజిలెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుంటారు. నేరుగా సిబిఐకి ఫిర్యాదులు ఉంటాయి. వాల్తేరు డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌పై ఇలా పక్కాగా ఫిర్యాదులండబట్టే అరెస్టయ్యారని తెలుస్తోంది. రైల్వే విజిలెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులు, సిబిఐకి వచ్చిన ఫిర్యాదులను సరిపోల్చి 50 శాతం దాటితే అధికారిపై ఒక ఫైలును సిబిఐ ఓపెన్ చేస్తుంది. డిఆర్ఎం సౌరబ్‌ప్రసాద్‌పై ఇదే జరిగింది. నేరుగా నగదుతోనే సిబిఐకి వాల్తేరు రైల్వే అధికారి దొరికిపోవడం రైల్వే చరిత్రలోనే ప్రథమం. ముంబయిలో గతంలో పని చేసిన అనుభవంతో సదరు అధికారి అక్కడే లంచం తీసుకోడానికి వెళ్లడంతో సిబిఐకి పని సులభం అయ్యిందని తెలుస్తోంది.

జమ్మలమడుగులో కొనసాగుతున్న ఉద్రిక్తత

- అదానీ గ్రూపుపై అల్లరి మూక దాడి పేరిట కేసు
- నిందితులు తెలిసినా చర్యలకు వెనుకంజ
- ఘటనపై ముఖ్యమంత్రి దృష్టికి వివరాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండల పరిధిలోని రాగికుంట వద్ద పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్‌పై దాడి ఘటనలో ఉద్రిక్తత కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుటుంబీకులు వందలాది మందితో కలిసి ప్లాంట్ వద్దకు వెళ్లి ఇక్కడ పనులు చేసేందుకు తమకు డబ్బులు ఇవ్వాలని, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని అడిగే పేరిట దౌర్జన్య పూరితంగా రాళ్లదాడికి దిగిన ఘటన తెలిసిందే. కంపెనీకి చెందిన పలు ఆధునిక యంత్రాలు, అద్దాలు ధ్వంసమైనట్లు అదానీ గ్రూపు, జిల్లాకు చెందిన బిజెపి ఎంపి సిఎం రమేష్ కుటుంబానికి చెందిన రిత్విక్ సంస్థ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వానికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళ్లప్రొద్దుటూరు పోలీసులు మంగళవారం రాత్రే (మాబ్) అల్లరిమూక దాడి పేరిట కేసు నమోదు చేశారు. దాడిలో ఎవరెవరు పాల్గొన్నారనే పేర్లతో కూడిన వివరాలు ఇవ్వకపోవడంతో అల్లరిమూక దాడి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు బాధిత అదానీ, రిత్విక్ గ్రూపులు దాడికి సంబంధించిన ఫొటోలు, వ్యక్తిగత పేర్లతో కూడిన వివరాలను అందజేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అదానీ గ్రూపుపై దాడి కేసులో ఎవరెవరి పేర్లు చేర్చారు, ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేశారో చెప్పకుండా పోలీసులు దాటవేస్తున్నారు. దర్యాప్తు సమయంలో కేసుల తీరు, సెక్షన్లు మారిపోతుంటాయని చెప్పడానికి అవకాశం ఉండదని ఓ పోలీస్ అధికారి పేర్కొనడం విస్మయాన్ని కలిగిస్తోంది. నిందితులు ఎవరనేది తెలిసినా వారిపై కేసు పెట్టడంలో మీనమేషాలు లెక్కించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదానీ గ్రూపుపై దాడి ఘటనపై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదానీ గ్రూపు ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. దాడి ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను అదానీ, రిత్విక్ గ్రూపు అధికారులు సిఎంకు వివరించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

- లారీ యజమానుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం డిమాండ్ చేసింది. విజయవాడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు, అధ్యక్షులు దాసరి శ్రీనివాసరెడ్డి, కృష్ణా జిల్లా అధ్యక్షులు నాగుమోతు రాజా, ట్రెజరర్ నాదెళ్ల కృష్ణ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో రవాణా రంగం కుదేలైందని తెలిపారు. గడిచిన ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్ రూ.200 నుంచి రూ.25 వేలకు పెంచిందన్నారు. అపరాధ రుసుములు కూడా రూ.20 వేల వరకూ పెంచారని పేర్కొన్నారు. ఇవి చాలదన్నట్లు క్వార్టర్లీ ట్యాక్స్ 30 శాతం, పెట్రోల్, డీజిల్ పన్నులూ పెంచారని వివరించారు. రవాణా రంగంలో అతి తక్కువ సమయంలో పెద్దయెత్తున భారం పడిందని పేర్కొన్నారు. ఈ సమస్యలపై తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ అధ్యక్షులు చంద్రబాబు, యువ నాయకులు లోకేష్‌కు విన్నవించామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ట్యాక్స్‌ల విషయంలోనూ ఇతర రాష్ట్రాలను పరిశీలించి తగ్గిస్తామని చెప్పారని వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత వరదల అనంతరం సంఘం తరపున ముఖ్యమంత్రికి, రవాణాశాఖ మంత్రికి వివరించామని పేర్కొన్నారు. దీనిపై అసెంబ్లీలో ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కూడా జరుగుతున్న నష్టాన్ని గణాంకాలతో వివరించారని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత లారీ యజమానులకు న్యాయం జరుగుతుందని భావించామని, ఆచరణలో అమలు జరగడం లేదని తెలిపారు. రిజిస్ట్రేషన్ల భారం ఎక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాల్లో చేయించుకుంటున్నారని, దీనివల్ల ఆదాయం పక్క రాష్ట్రాలకు పోతోందని పేర్కొన్నారు. డీజిల్ ధరలు తగ్గించినందువల్ల కొనుగోళ్లు పెరిగి ఆదాయం వస్తుందని, దీన్ని కొద్దికాలం పరిశీలించి నష్టం వస్తే మరలా ధరలు పెంచుకోవాలని సూచించామని, దీన్ని కూడా అమలు చేయడం లేదని తెలిపారు. ప్రగతి నుండి ఇ-వాహన్‌కు డేటా పంపించడం వల్ల వాహన యజమానులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. నాలుగు నెలల నుంచి తీవ్ర సమస్యలున్నాయని, ఎన్ఐసి అధికారులు కూడా ఏమీ చేయలేకపోవడంతో వాహనదారులు రెగ్యులరైజ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల లారీ యజమానులు ఫిట్నెస్ పరీక్షలు చేయించుకోలేక అవస్థలు పడుతున్నారని వివరించారు. దీనిపై వెంటనే స్పందించి ప్రభుత్వం లారీ యజమానులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

వృద్ధి 6.5 శాతానికి పతనం

- ఇక్రా రేటింగ్స్ అంచనా

ముంబయి : భారత వృద్ధి రేటు తిరోగమనం పట్టనుందని అంతర్జాతీయ ఎజెన్సీలు హెచ్చరిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 6.5 శాతానికి పరిమితం కావొచ్చని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా బుధవారం ఓ రిపోర్ట్‌లో విశ్లేషించింది. ఇంతకు రెండు రోజుల క్రితం మోర్గాన్ స్టాన్లే కూడా జిడిపి అంచనాలకు ఏడు శాతం నుంచి ఏకంగా 6.3 శాతానికి కోత పెట్టింది. ఇక్రా రేటింగ్స్ రిపోర్ట్ ప్రకారం.. ఈ ఏడాది భారీ వర్షాలు, బలహీనమైన కార్పొరేట్ కంపెనీల పనితీరు కారణంగా సెప్టెంబర్ త్రైమాసికంలో దేశ జిడిపి 6.5 శాతానికి తగ్గొచ్చు. కాగా.. 2024-25 ద్వితీయార్థంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునే అవకాశాలున్నాయి. దీంతో ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధి ఉండొచ్చు. పట్టణ వినిమయం తగ్గుతోందన్న రిపోర్ట్‌ల నేపథ్యంలో ఇక్రా జిడిపి అంచనాలకు కోత పెట్టడం విశేషం. 2024-25లో జిడిపి 7.2 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 6.7 శాతం వృద్ధి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ త్రైమాసికం జిడిపి గణంకాలను నవంబర్ 30న కేంద్ర గణంకాల శాఖ అధికారికంగా వెల్లడించనుంది. "సెప్టెంబర్ త్రైమాసికంలో పారిశ్రామిక రంగం ముఖ్యంగా మైనింగ్, విద్యుత్ రంగాలు మందగించే అవకాశం ఉంది. భారీ వర్షపాతం కారణంగా అనేక రంగాలు ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయి. సరుకుల ఎగుమతుల్లో పతనం. పడిపోతున్న వ్యక్తిగత రుణాల వల్ల డిమాండ్ పడిపోవచ్చు. ఈ పరిణామాలు వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపొచ్చు." అని ఇక్రా ఎకనామిస్ట్ అదితి నాయర్ పేర్కొన్నారు.

క్విక్ కామర్స్‌తో కిరాణా స్టోర్లపై ప్రభావం

- డేటామ్ రిపోర్ట్

న్యూఢిల్లీ : క్విక్ కామర్స్‌తో సంప్రదాయ కిరాణా స్టోర్ల వ్యాపారం క్రమంగా తగ్గుతోందని డేటామ్ రిపోర్ట్‌లో తేలింది. 2018లో కిరాణా స్టోర్స్ మార్కెట్ వాటా 95 శాతంగా ఉండగా.. 2023లో 92.6 శాతానికి తగ్గిందిని వెల్లడించింది. ఇది 2028 నాటికి 88.9 శాతానికి తగ్గొచ్చని అంచనా వేసింది. ఇందుకు ప్రధాన కారణం ఆన్‌లైన్ కిరాణా షాపింగ్‌కు ప్రాధాన్యత పెరగడమేనని ఆ రిపోర్ట్ పేర్కొంది. 5 శాతం మంది కిరాణా స్టోర్ల నుంచి కొనుగోలు చేయడం పూర్తిగా మానేసినట్లు సర్వే వెల్లడించింది. క్విక్ కామర్స్ 2024లో ఏకంగా 74 శాతం వృద్ధిని అంచనా వేసింది. ఇది 2023-28 కాలంలో అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న రిటైల్ ఛానెల్‌గా ఉందని ఆ పరిశ్రమ వర్గాల అంచనా.

బిర్లా ఓపస్ పెయింట్స్ తయారీ విస్తరణ



బెంగళూరు : ఆదిత్య బిర్లా గ్రూప్‌లోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భాగమైన బిర్లా ఓపస్ పెయింట్స్ తన నాలుగో ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. మైసూరుకు సమీపంలోని చామరాజ్‌నగరలో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. పూర్తిగా ఆటోమేటెడ్, ఇంటిగ్రేటెడ్ పెయింట్ ప్లాంట్ ఏడాదికి 866 మిలియన్ లీటర్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉందని ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు. మూడేళ్లలో రూ.10వేల కోట్ల ఆదాయాన్ని చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

డిసెంబర్‌లో ఐయుఎంఎఫ్ సదస్సు

బెంగళూరు : అంతర్జాతీయ యూనిఫాం తయారీదారుల సదస్సు (ఐయుఎంఎఫ్) 2024ను బెంగళూరులో నిర్వహించనున్నారు. ఇది డిసెంబర్ 18 నుండి 20 వరకు జరుగుతుందని సోలాపూర్ గార్మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎస్‌జిఎంఎ) ఛైర్మన్ సునీల్ మెంగ్జీ తెలిపారు. దీనికి పరిశ్రమలోని తయారీదారులు, సరఫరాదారులు, పంపిణీదారులకు వారి తాజా ఉత్పత్తులను ప్రదర్శించనున్నారన్నారు. 120 ప్రముఖ బ్రాండ్‌లు 10,000 కంటే ఎక్కువ డిజైన్‌ల యూనిఫాం దుస్తులు, యూనిఫాం ఫ్యాబ్రిక్స్ ఉపకరణాలతో పాల్గొంటాయన్నారు.

సంపాదకీయం

కాలుష్య రాజధాని

దేశ రాజధాని ఢిల్లీ నగరం కాలుష్య రాజధానిగా కూడా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీతో పాటు, జాతీయ రాజధాని ప్రాంతం (నేషనల్ క్యాపిటల్ రీజియన్-ఎన్.సి.ఆర్) అంతా వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర రీతిలో పెరుగుతోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎ.క్యు.ఐ) వరుసగా మూడు రోజుల పాటు 500 మార్కును దాటడం ప్రమాద తీవ్రతకు నిదర్శనం. నిపుణులు ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా దీనిని అభివర్ణిస్తున్నారు. కొద్ది రోజుల నుండే దేశ రాజధానిలో విద్యాసంస్థలు మూతపడ్డాయి. జెఎన్‌యు ఆన్‌లైన్ బాట పట్టింది. అనేక ప్రైవేటు సంస్థలు ఇప్పటికే వర్క్ ఫ్రం హోం విధానాన్ని అమలు చేస్తుండగా, తాజాగా ఢిల్లీ ప్రభుత్వం సైతం 50 శాతం ఉద్యోగులను ఇంటి నుండే పని చేయాలని ఆదేశించింది. బుధవారం ఉదయం తొమ్మిది గంటల లోపే ఢిల్లీ ప్రభుత్వం ఈ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. పెద్ద సంఖ్యలో ప్రజానీకం రోగాల బారిన పడటం, రోడ్లన్నీ పొగతో నిండి ఊపిరాడని పరిస్థితి నెలకొనడంతో అత్యవసర పనులుంటేనే ప్రజలు రోడ్ల మీదకు రావాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇళ్ల దగ్గర కూడా కిటికీలు మూసి ఉంచాలని, నాణ్యమైన ఎయిర్ ప్యూరిఫయర్లు వాడుకోవాలని సూచించింది. వీటన్నింటిని పాటించడం ఎందరికి సాధ్యమవుతుందన్న సంగతి అటుంచితే పరిస్థితి తీవ్రతకు నిదర్శనాలుగా భావించవచ్చు. ఈ స్థాయి విపత్తును కూడా రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తుండటం, ఆప్ సర్కారుకు సహాయ నిరాకరణ చేస్తుండటం మోడీ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. వర్షాలు కురిస్తే కాలుష్యం అదుపులోకి వచ్చే అవకాశం ఉండటంతో మేఘ మథనానికి అనుమతి ఇవ్వాలని ఆప్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గం! రెండు సంవత్సరాల క్రితం ఇటువంటి పరిస్థితే నెలకొన్నప్పుడు వాయు కాలుష్యాన్ని రాజకీయ పోరుగా మార్చవద్దని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. అయినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోవడం బాధాకరం.

వాయు కాలుష్యంతో ఢిల్లీ ప్రజానీకం రెండు దశాబ్దాలకు పైగా పోరాటం చేస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా అనేకసార్లు జోక్యం చేసుకుంది. అత్యున్నత న్యాయస్థానం జోక్యంతో పంజాబ్, హర్యానాతో పాటు ఢిల్లీ పరిసరాల్లో ఉన్న అనేక రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబట్టే సంఘటనలు గత రెండు సంవత్సరాల్లో కొంత మేర తగ్గిన్నట్లు చెబుతున్నారు. అయినా కాలుష్యం తగ్గకపోగా, మరింతగా పెరుగుతోంది. దీంతో ఇతర కారణాలనూ అధికార యంత్రాంగం అన్వేషిస్తోంది. ఉదాహరణకు ఈ నెల 12వ తేది ఒక్కరోజే ఢిల్లీ నగరంలో 50 వేలకు పైగా పెళ్లిళ్లు జరిగినట్లు, ఆ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచాను కాల్చినట్లు అధికారులు గుర్తించారు. వ్యక్తిగత వాహనాల వినియోగం సాధ్యమైనంత మేర తగ్గించాలని, ప్రజా రవాణా వ్యవస్థను గణనీయంగా పెంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు పూర్తి స్థాయిలో అమలు కాలేదు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సి.ఎస్.ఇ) అక్టోబర్‌లో చేసిన అధ్యయనం ప్రకారం ఢిల్లీ స్థానిక వాయు కాలుష్యంలో రవాణా రంగ వాటా సగానికి పైగా ఉందని తేలింది. 2021లో విడుదలైన ఒక నివేదిక ప్రకారం జాతీయ రాజధాని ప్రాంతంలో కాలుష్యానికి పరిశ్రమలు, భవన నిర్మాణ రంగం కూడా ప్రధాన కారణాలే! 30 శాతం ఢిల్లీ నగరంలో నగర పాలక సంస్థ సేవలు అందకపోవడంతో స్థానిక ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ తగలబెడుతున్నారు.

ఈ పరిస్థితులే ఢిల్లీని కాలుష్య రాజధానిగా మారుస్తున్నాయి. చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ రెండు సంవత్సరాల క్రితం రూపొందించిన నివేదికలో కాలుష్య స్థాయి ఇదే మాదిరి కొనసాగితే ఢిల్లీ ప్రజానీకం తమ జీవిత కాలంలో 11.9 సంవత్సరాలు కోల్పోతారంటూ హెచ్చరించింది. అయినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పులు రాలేదు. సమిష్టి చర్యల ద్వారానే కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్న అంశాన్ని కేంద్రం గుర్తించాలి. ఢిల్లీ ప్రభుత్వం తీసుకునే చర్యలకు అవసరమైన సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందచేయాలి. ఎక్కడికక్కడ ప్రజలను చైతన్యవంతం చేయాలి. ఇప్పుడు కూడా ఈ దిశలో కదలకపోతే, భవిష్యత్తులో చేయడానికి ఏమీ మిగలని పరిస్థితి ఏర్పడుతుంది.

మహనీయుల మాట




అక్రమ సంపాదనతో చేసే
విందు భోజనం కన్నా
కష్టార్జితంతో తాగే
గంజినీరు ఎంతో సంతృప్తినిస్తుంది.
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య

Mokshagundam visvesvaraya

విశ్లేషణ

గత ప్రభుత్వ దారిలోనే ప్రస్తుత బడ్జెట్





డా|| బి.గంగారావు

ఆర్థిక సంవత్సరం (2024-25) ముగియటానికి మరో నాలుగు నెలలు మిగిలి ఉండగా తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కింద రూ. లక్షా 9 వేల కోట్లు ఆమోదింపజేసుకుంది. ఆ తరువాత కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా గవర్నర్ ఆర్డినెన్స్ ద్వారా రూ.1.29 లక్షల కోట్లు ఆమోదం తీసుకుంది. వెంటనే బడ్జెట్‌ను ప్రవేశ పెడితే సూపర్ 6 పథకాలు అమలు చేయాల్సి వస్తుందని భావించి నాలుగు నెలలు ఆర్డినెన్స్ ద్వారా నెట్టుకొచ్చి ఇప్పుడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత వైసిపి బడ్జెట్లకి ప్రస్తుత బడ్జెట్‌కి మధ్య ఎలాంటి తేడా లేదనేది వాస్తవం.

మొత్తం 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూ.2.94 లక్షల కోట్లుగా రూపొందించారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో తన సొంత పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.లక్షా 20 వేల కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా ద్వారా రూ.50,391 కోట్లు, కేంద్ర గ్రాంట్ల ద్వారా రూ.30,333 కోట్లు...మొత్తం రూ.2,01,173 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఇది గాక అప్పుల ద్వారా రూ.93253 కోట్లు ఆదాయం సమకూర్చుకోవాలని ప్రతిపాదించారు. మొత్తంగా బడ్జెట్‌లో రూ. 34743 కోట్ల రెవిన్యూ లోటు, రూ.68742 కోట్ల ద్రవ్యలోటు ఏర్పడుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిపాదించినట్లు పూర్తి స్థాయిలో ఆదాయాన్ని సమకూరటం సాధ్యం కాదు. బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే బడ్జెట్ వాస్తవ ఆదాయం ఎప్పుడూ15 నుండి 20 శాతం తగ్గుతూ వస్తున్నది. ఆదాయం తగ్గిన మేరకు ప్రజా సంక్షేమం, అభివృద్ధి, మూలధన వ్యయంపై కోతలు పడతాయి. ప్రజలపై అదనపు పన్నులు చార్జీల భారాలు మోపుతారు.

రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో రూ.24 వేల కోట్లు అదనంగా పనుల ద్వారా ఆదాయం వస్తుందని పేర్కొన్నది. సేల్స్ టాక్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ఎక్సైజ్, పన్నేతర ఆదాయాల నుండి ఈ అదనపు వనరులు సమకూర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నది. అంటే భవిష్యత్తులో ప్రజల మీద అదనపు పన్నుల భారం తప్పదని తేలిపోతున్నది. అలాగే మద్యం విచ్చలవిడి అమ్మకాల ద్వారా ఈ ఏడాది రూ. 25,597 కోట్లు రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన సూపర్ 6 పథకాలు, యువగళంలో ఇచ్చిన వాగ్దానాలను అమలులోకి తీసుకు వచ్చేలా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. కొన్నిటికి అరకొరగాను, మరికొన్నిటికి అసలు నిధులే పేర్కొనలేదు. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇప్పుడు రూ.6,487 కోట్లు మాత్రమే కేటాయించారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.1026 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన 52 లక్షల మందికి ఈ పథకం వర్తింపచేసినా కూడ కనీసం రూ.5740 కోట్లు కేటాయించాలి. మహిళా నిధి పథకానికి నామమాత్రంగా రూ.3341 కోట్లు కేటాయించారు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల దీపం పథకానికి రూ.895 కోట్లే కేటాయించారు. ఈ ఏడాదిలో మరో ఉచిత సిలిండర్‌కి మంగళం పాడారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రస్తావనే లేదు. నిధులు కేటాయించలేదు. నిరుద్యోగులకు ప్రతినెల రూ.3 వేలు చొప్పున ఇస్తానన్న నిరుద్యోగ భృతికి కూడా నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వంపై నెపం నెట్టి సూపర్ సిక్స్‌కు అరకొర నిధులు కేటాయిస్తూ, కొన్నింటికి అసలు నిధులే కేటాయించకుండా వాయిదా వేయటం ప్రజలను వంచన చేయటమే.

ఈ బడ్జెట్లో రూ.32,712 కోట్లు మూల ధన వ్యయం కింద నిధులను ప్రతిపాదించారు. ఈ కేటాయింపులను గొప్పగా ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. వాస్తవంగా తెలుగుదేశం పరిపాలించిన 2014-19 కాలంలో సగటున 13,865 కోట్లు, వైసిపి పాలనా కాలం 2019-24 మధ్య సగటున 15,632 కోట్లు మూలధన వ్యయాలు చేశాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కేటాయింపులు అతి స్వల్పమైనవి. ఇవి కూడా పూర్తిస్థాయిలో ఖర్చు పెడతారనే గ్యారంటీ ఏమీలేదు.

మూల ధన వ్యయంలో భారీ, మధ్య, చిన్న తరహా నీటి ప్రాజెక్టులకు రూ.1471 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టుకి కేంద్రం నుండి రూ. 4873 కోట్లు నిధులు వస్తాయని ఆశిస్తున్నారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల నిధుల కేటాయింపులు ఖర్చులు ఒక ప్రహసనంగా కొనసాగుతున్నది. ఇప్పుడు కూడా ఇదే తంతు జరుగుతుంది. అంతేగాక ఈ నాలుగు నెలల్లో ఈ నిధులు ఖర్చు పెట్టడం సాధ్యమేనా? కేవలం ప్రజలను మభ్యపెట్టడానికే ఈ అంకెలని తెలుస్తున్నది.

రాష్ట్ర అప్పులపై గత కొన్నేళ్లుగా పెద్ద చర్చ సాగుతున్నది. మొత్తం రాష్ట్ర అప్పును రూ.6.46 లక్షల కోట్లుగా బడ్జెట్‌లో ప్రకటించారు. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూనే ఈ బడ్జెట్‌లో సుమారు రూ.93, 253 కోట్లు అప్పులు తీసుకు రావాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి)లో 34.14 శాతానికి, తలసరి అప్పు రూ.లక్ష 93 వేలకి చేరింది. ముఖ్యమంత్రి మాత్రం రూ. 9.74 లక్షల కోట్లు మొత్తం రాష్ట్ర అప్పు ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. ప్రకటనలు ఎలా ఉన్నా రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి దించుతున్నారనేది వాస్తవం. ఈ అప్పులపై గత ఏడాది రూ.46,479 కోట్లు అసలు, వడ్డీగా చెల్లిస్తే ఈ ఏడాది రూ.53253 కోట్లు చెల్లించాలని ప్రతిపాదించారు. అప్పులన్నీ అనుత్పాదక ఖర్చులకే వినియోగిస్తున్నారు. ఈ తరహా ఖర్చుల వల్ల రాష్ట్ర అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగం జరగదు. కేంద్రం నుండి తీసుకునే అప్పులు ఈ బడ్జెట్లో రూ.18,249 కోట్లు చూపారు. ఇందులో ఎక్కువ భాగం సంస్కరణలకు ముడిపెట్టి తీసుకొస్తున్నవే.

ఈ అప్పులకు ప్రధాన కారణం వైసిపి, తెలుగుదేశం పార్టీలు అనుసరించిన అవకాశవాద రాజకీయాలే. కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల ఆదాయాలను దెబ్బ తీస్తున్నది. కేంద్ర పన్నుల నుండి రాష్ట్రాలకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా కోతలు పెడుతున్నది. కేంద్ర పన్నుల నుండి రాష్ట్రాలకు పంపిణీ చేసే ఆదాయంలో ఆంధ్ర రాష్ట్ర వాటా గత 10 ఏళ్లలో 5 నుండి 4 శాతానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఇంతగా తీవ్ర వివక్షకు, అణచివేతకు పాల్పడుతుంటే రాష్ట్రంలోని గత వైసిపి, ఇప్పటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం బిజెపి భజన చేస్తున్నాయి. పైపెచ్చు ప్రైవేటీకరణ సంస్కరణలు ముడిపెట్టి కేంద్రం ఇస్తున్న రుణాలపై ఎగబడి తీసుకుంటూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. గతంలో విద్యుత్ సంస్కరణలు, ఆస్తి పన్ను పెంపు, కార్మిక చట్టాల్లో మార్పులు, భూ సర్వే వంటి వాటి అమలకు హామీ ఇచ్చి అప్పులు తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలపై అనేక భారాలు గత ప్రభుత్వం మోపిన విషయం తెలిసిందే. ఈ ప్రభుత్వం కూడా ఇదే దారిలో కొనసాగుతూ ఈ బడ్జెట్‌లో సంస్కరణలతో ముడిపెట్టిన అప్పులను తీసుకురావటానికి ప్రతిపాదనలు చేసింది.

డిఎస్సీ మినహా రాష్ట్ర ప్రభుత్వ ఖాళీల భర్తీ గుర్తించి ఏమాత్రం బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. గతంలో వైసిపి ప్రభుత్వం కూడా గ్రామ సచివాలయ ఉద్యోగుల భర్తీకే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీము వర్కర్లుగా లక్షల మంది పనిచేస్తున్నారు. వీరి సర్వీసులు క్రమబద్ధీకరణగాని లేదా వీరి వేతనాలు పెంచుతూ అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు గాని చేయలేదు. కనీసం పట్టణ ఉపాధి హామీ పథకాన్నయినా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు.

గత రాష్ట్ర ప్రభుత్వం వలే ఈ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు రాష్ట్ర నాల్గవ ఆర్థిక సంఘం నిర్దేశించిన ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా అన్యాయం చేసింది. వాస్తవంగా రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయంలో కనీసం 30 శాతం వాటాగా స్థానిక సంస్థలకు నిధులు బడ్జెట్‌లో కేటాయించాలి. ఈ బడ్జెట్‌లో రూ.లక్ష 9 వేల కోట్లు సొంత పన్నుల ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తున్నది. ఇందులో కనీసం 30 శాతం (రూ.32,961 కోట్లు) కేటాయించాలి. ఇవేగాక గ్రాంట్లు, ప్రత్యేక అభివృద్ధి నిధులు తలసరి గ్రాంట్లు కూడా ఇవ్వాలి. వీటన్నింటికి ముగింపు పలికారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగిన విధంగా నిధులు కేటాయించలేదు. కేవలం రూ.5 వేల కోట్లే కేటాయించారు. సగటున 64 రోజులు మాత్రమే పని కల్పిస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఈ నాలుగేళ్ళలో జాబ్ కార్డులను 94 లక్షల నుండి 68 లక్షలకు కుదించేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటు పని దినాలు 43 రోజులకి పడిపోయింది.

ఈ బడ్జెట్‌లో ఆందోళన కలిగించే అంశం విద్యుత్ రంగానికి కేటాయించే నిధుల్లో కోత పెట్టడం. గత ఏడాది మాత్రం కేటాయింపులు కూడా ఈ బడ్జెట్‌లో చేయలేదు. ఉచిత విద్యుత్‌కు సరిపడా నిధులు కూడా కేటాయించలేదు. పైపెచ్చు ఈ ప్రభుత్వం రూ.17,899 కోట్ల మీద ఇంధన సర్దుబాటు చార్జీల కింద, ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపింది. భవిష్యత్తులో ఈ రంగంలో తీవ్ర మార్పులకు బిజెపితో కలిసి రాష్ట్ర కూటమి ప్రభుత్వం పాల్పడుతుందనేది సుస్పష్టమవుతున్నది.

జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ తరగతులకు 23.5 శాతం నిధులు కేటాయించాలి. కానీ 8.5 శాతం మాత్రమే నిధులు కేటాయించారు. గత ప్రభుత్వం కేటాయించిన నిధుల కన్నా రూ.1507 కోట్లు కోత పెట్టారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు కూడా సరిపడా నిధులు కేటాయించలేదు. పోలవరం నిర్వాసితులకు, పునరావాస పనులకు కూడా నిధులు కేటాయించకపోవడం శోచనీయం. సహకార రంగానికి కేటాయింపులు లేవు. ఇక వెనుకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో తావు లేదు. స్థూలంగా గత వైసిపి ప్రభుత్వం నడిచిన బాటలోనే చంద్రబాబు కూటమి ప్రభుత్వం నడుస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతున్నది. ఇది రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేస్తుంది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

గత ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కింద రూ. లక్షా 9 వేల కోట్లు ఆమోదింపజేసుకుంది. ఆ తరువాత కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా గవర్నర్ ఆర్డినెన్స్ ద్వారా రూ.1.29 లక్షల కోట్లు ఆమోదం తీసుకుంది. వెంటనే బడ్జెట్‌ను ప్రవేశ పెడితే సూపర్ 6 పథకాలు అమలు చేయాల్సి వస్తుందని భావించి నాలుగు నెలలు ఆర్డినెన్స్ ద్వారా నెట్టుకొచ్చి ఇప్పుడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత వైసిపి బడ్జెట్లకి ప్రస్తుత బడ్జెట్‌కి మధ్య ఎలాంటి తేడా లేదనేది వాస్తవం.

డిఎస్సీ మినహా రాష్ట్ర ప్రభుత్వ ఖాళీల భర్తీ గుర్తించి ఏమాత్రం బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. గతంలో వైసిపి ప్రభుత్వం కూడా గ్రామ సచివాలయ ఉద్యోగుల భర్తీకే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీము వర్కర్లుగా లక్షల మంది పనిచేస్తున్నారు. వీరి సర్వీసుల క్రమబద్ధీకరణగాని లేదా వీరి వేతనాలు పెంచుతూ అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు గాని చేయలేదు. కనీసం పట్టణ ఉపాధి హామీ పథకాన్నయినా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు.

అభిప్రాయం

బోధనేతర పనులతో సమయం వృథా



ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో సమయం వృథా అవుతున్నది. రకరకాల యాప్‌లు, డిజిటల్ పనుల వలన బోధన కుంటుపడుతున్నది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్నెట్ సిగ్నల్ సరిగా లేని చోట ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్ ద్వారా డేటా యాప్‌లలో అప్‌లోడ్ చేయడానికి అధిక సమయం పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఉపయోగించిన అన్ని రకాల యాప్‌లు ఇప్పుడు కూడా వినియోగంలో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఉన్న యాప్‌ల భారం తగ్గించి వారిని కేవలం బోధనకే పరిమితం చేస్తామని హామీ ఇచ్చింది. అయినప్పటికీ, యాప్‌ల భారం తగ్గించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

ఉపాధ్యాయుడు పాఠశాలలోకి వచ్చిన వెంటనే ఫేషియల్ అటెండెన్స్, విద్యార్థుల హాజరుకు సంబంధించి వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. విద్యార్థుల హాజరును ఉదయం 9 గంటల 30 నిమిషాలు లోపు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇది ముగిసిన తర్వాత పది గంటల ముప్పై నిమిషాల తర్వాత మరుగుదొడ్ల ఇన్‌స్పెక్షన్ ఫామ్ పూర్తి చేసి సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది. మరుగుదొడ్లకు సంబంధించి ఫొటోలను సమీప సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, స్కూలు అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉన్నా, అధిక శాతం పాఠశాలల్లో ఆ పని కూడా ఉపాధ్యాయులే చేయాల్సిన పరిస్థితి. విద్యార్థుల అసెస్‌మెంట్ టెస్ట్ మార్కులను ప్రతి తరగతి ఉపాధ్యాయుడు 'ఫేషియల్ అటెండెన్స్' యాప్‌లో ఎంటర్ చేయాలి. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఐ.ఎం.ఎం.ఎస్ యాప్‌లో గుడ్లు, చిక్కీలు, రాగి జావ, భోజనం వడ్డింపు తదితర వివరాలను అప్‌లోడ్ చేయాలి. ఇలాంటి బోధనేతర పనులతో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురౌతున్నారు. డిజిటల్ అసిస్టెంట్ చేయాల్సిన పనులన్నీ ఉపాధ్యాయులతో చేయించడం జరుగుతోంది. మరోవైపు విద్యాశాఖ అధికారులు వంద శాతం 'అపార్' ఐడీలు సృష్టించమని ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. 'అపార్' కార్డు జారీ ప్రక్రియలో ఆధార్ వివరాలు, స్కూలు రికార్డులలో ఉన్న వివరాలు సరిపోలక పోవడంతో ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఆధార్ వివరాల అప్‌డేట్ కోసం తల్లిదండ్రులు, పిల్లలు ఆధార్ సవరణ కేంద్రాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయులకు వివిధ రకాల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను నిర్వహిస్తూ బోధనకు దూరం చేయడం సబబు కాదు. వివిధ రకాల యాప్‌లను రద్దు చేసి ఆన్‌లైన్ పనుల నిర్వహణకు ప్రతి పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ని నియమించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా.

వ్యాఖ్య

ఇంకా నరబలులా...?



ఈ వైజ్ఞానిక యుగంలోనూ ముక్కుపచ్చలారని బిడ్డల్ని... మూర్ఖంగా ఏవేవో ఆశించి మంత్రగాళ్ళ మాటలు నమ్మి బలివ్వడమేమిటి? ఏ శక్తి వీళ్ళనిలా నడిపిస్తోంది? ఏ బలహీనత వీళ్ళనిలా పురమాయిస్తోంది? అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోని అత్యున్నత విద్యావంతులు సైతం నరబలి లాంటి మౌఢ్యాన్ని నెత్తికెత్తుకుంటే ఇక వెనుకబడ్డ రాష్ట్రాల్లో, మారు మూల గ్రామాల్లో, అడవుల్లో కొండల్లోని గిరిజన తెగల్లో మంత్రగాళ్ళ స్వైర విహారానికి అడ్డూ అదుపూ ఏముంటుంది?

కొన్ని వార్తలు వింటుంటే మనం ఆదిమ బర్బర యుగాల్లోంచి ఇంకా ఒక్క అడుగూ ముందుకు వేయలేకపోతున్నామా అనిపిస్తుంది. అలాంటి వార్తల్లో ఒకటి '2014-21 మధ్య 103 నరబలులు జరిగా'యన్న వార్త! సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వ "జాతీయ నేర రికార్డు బ్యూరో" (ఎన్.సి.ఆర్.బి) బయటపెట్టిన వాస్తవమిది. అంతే కాదు 2022లో కూడా ఇలాంటివి ఆరు జరిగాయట! ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (26 అక్టోబరు 2024) తాజా కథనమిది. రికార్డుకెక్కినవే ఇన్ని వుంటే బయటికే పొక్కనివి మరెన్ని వుంటాయి? మరీ సిగ్గేసే విషయం ఏమిటంటే ఈ బ్యూరో నేరాల జాబితాలో నరబలుల గణాంకాల కోసం ఒక ప్రత్యేక కాలమ్ ఇప్పటికీ ఉండడం! అది రెగ్యులర్‌గా అప్‌డేట్ అవుతుండడం!

గత సంవత్సరం సెప్టెంబర్ 22న ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్ ప్రైవేటు రెసిడెన్షియల్ స్కూల్లో 11 ఏళ్ల బాలుడిని బలిచ్చిన వార్త అప్పుడు దేశానికి దేశాన్నే కుదిపివేసింది. ఈ "పవిత్ర క్రతువును" ఆ పాఠశాల ప్రిన్సిపాలు, డైరెక్టరు (ఇద్దరూ తండ్రీకొడుకులు) కలిసి తమ "సౌభాగ్యం" కోసం నిర్వహించారు! అంతకు ముందు 1980లో తమిళనాడులోని ఒక ప్రాథమిక పాఠశాలలో కూడా ఇద్దరు పసిపిల్లల్ని ఇలానే బలిచ్చారు. మన రాష్ట్రమూ ఇలాంటి కిరాతక తాంత్రిక బలిదానాల్లో తక్కువేమీ తినలేదు. మదనపల్లిలో గణితమూ, రసాయన శాస్త్రమూ బోధించే అధ్యాపకులే 2021లో వయసొచ్చిన తమ ఇద్దరు కూతుళ్లను "పరలోక సిద్ధికి" ప్రేరణనిచ్చి కడతేర్చారు !

ఒకప్పుడు సైన్సూ, చదువూ విస్తరించనప్పుడు, గ్రామాలు అంధకారమయంగా వున్నప్పుడు, కుల కట్టుబాట్లు కొందరిని ప్రపంచానికి దూరంగా నెట్టేసినప్పుడు, ప్రజల అజ్ఞానం పెట్టుబడిగా ఆధిపత్యం సాగుతున్నప్పుడు ఇలాంటివి సాగాయంటే అంతో ఇంతో అర్థం చేసుకోవచ్చు. కానీ ఇప్పుడు మనం మూడో ఆర్థిక శక్తిగా ఎదిగిన వాళ్ళం. చంద్ర మండలాన్ని చేరుకున్న వాళ్ళం. ప్రపంచంలోనే అతి పెద్ద మధ్య తరగతి మనది. ఎల్లలు చెరిపేసి లోకమంతా అల్లుకుపోతున్న వాళ్ళం మనం. మరీ ఇటీవల విశ్వగురు పీఠం మీద కూడా వున్న వాళ్లం! ఈ వైజ్ఞానిక యుగంలోనూ ముక్కుపచ్చలారని బిడ్డల్ని మూర్ఖంగా ఏవేవో ఆశించి మంత్రగాళ్ళ మాటలు నమ్మి బలివ్వడమేమిటి? ఏ శక్తి వీళ్ళనిలా నడిపిస్తోంది? ఏ బలహీనత వీళ్ళనిలా పురమాయిస్తోంది? అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోని అత్యున్నత విద్యావంతులు సైతం నరబలి లాంటి మౌఢ్యాన్ని నెత్తికెత్తుకుంటే ఇక వెనుకబడ్డ రాష్ట్రాల్లో, మారు మూల గ్రామాల్లో, అడవుల్లో కొండల్లోని గిరిజన తెగల్లో మంత్రగాళ్ళ స్వైర విహారానికి అడ్డూ అదుపూ ఏముంటుంది?

ఇప్పుడు రాజ్యాంగబద్ధ పదవుల్లో వున్నవారే సంప్రదాయం పేరుతో ఛాందసాన్ని పెంచి ప్రోత్సహిస్తున్నారు. దీనికి తోడు సామాజిక మాధ్యమాలు ఏ రుజువులు లేని కథనాల్ని ఇష్టం వచ్చినట్లు కుమ్మరిస్తున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్న స్వాములకూ, బాబాలకూ నోటి నిండా పనీ ప్రచారం ఇవి కల్పిస్తున్నాయి. హేతుత్వానికి, సత్యానికి క్రమంగా నిలువ నీడ లేకుండా పోతోంది. పెరుగుతున్న మధ్య తరగతి, కింది వర్గాల సంస్కృతీకరణ కూడా ఈ ధోరణికి పెద్ద ఆలంబనంగా మారుతున్నాయి. క్రమంగా ఒక ప్రకటిత అంగీకారం సమాజంలో దీనికి లభిస్తోంది. ఇలా చూస్తే ఇవేవో చెదురు మదురు సంఘటనలని తేలిగ్గా కొట్టి పారెయ్యలేం. ఎప్పుడూ చరిత్ర నిండా వున్నవేనని సరిపెట్టుకోలేం. ఒక క్రమంలో వాటికవే రూపు మాసిపోతాయని విస్మరించి వదిలెయ్యలేం. మన ఆలోచనా ధోరణుల్ని, సాంస్కృతిక హైన్యాన్ని, మొత్తంగానే మన సమాజపు నడకను తీవ్రంగా ప్రశ్నిస్తున్నవివి! నడమంత్రపు సిరినీ, పైపై ఆర్భాటాల్ని చూసి మురిసిపోతున్న మనం ఎంత కాలం చెల్లిన సాంస్కృతిక పునాదులపై ఈ సౌధాలు నిర్మిస్తున్నామో గుర్తించమని చేస్తున్న హెచ్చరికలివి! శాస్త్ర సామాజిక సాంస్కృతిక ఉద్యమకారులందరికీ ఎప్పుడూ ఎరగని సవాళ్లివి!

/ నవంబర్ 15 'జన విజ్ఞానం' సంపాదకీయం/

కవిత్వం

పెట్టుబడుల వలలో చిక్కిన జాలరి!

ఏటిలోన, నడి సముద్రాలలోన
ఎన్నిసార్లు చేతివలలు విసిరినా
చిన్న సిత్తి రాయి పడటంలేదు?
తరంగాలలో చేపల వేట చేసినా
నడుమకున్న బుంగ నిండటంలేదు?
చేపల వేట చేసే జాలరి బతుకులు
రోజు రోజుకీ దిగజారుతున్నాయి.
వారసత్వమున్న మత్స్యకారులు
కడలి మధ్యనే కట్టుకుంటారు నివాసాలు
తెరచాప పడవలతోనే వారి సావాసాలు
అలల మధ్యలో వలలు విసురుతూ
అపురూప చేపలను పట్టుబడతారు
బతుకు యాత్రను నీటిపాయలపైనే కొనసాగిస్తారు.
కల్లోల కడలిలోకి వీరమల్లుడిలా వెళ్లి
వలలను విసురుతారు వడివడిగా
వేల కోట్ల మత్స్య సంపదను వెలికి తీసి
తన జాతికి అందిస్తారు జాగ్రత్తగాను
వచ్చిన లాభంతో బొచ్చెలా ఎగురుతూ
నేలమీద ఉత్సాహ కెరటమౌతారు?
ఇల్లు విడిచి ఇల్లాలును మరచి
కడలిలోకి ప్రయాణం చేస్తుంటారు
రోజుల తరబడి సముద్రంలో వేట చేసినా నేడు
జాలరి శ్రమకి ఫలితం దక్కటంలేదు?
తీరప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కింది
మత్స్య సంపదంతా మృత్యువాత పడుతోంది
సంప్రదాయ చేపల వేటలోకి సంపన్న వర్గాలు చేరాయి
భారీ పడవలతో వచ్చి నడి సంద్రంలో
పెద్ద పెద్ద వలలను విసురుతూ
జలరాశిలోని మిగిలిన మీన రాశులను పట్టుకు పోతుండగా
పెట్టుబడుల వలలో చిక్కిన జాలరి చేపలా
సంప్రదాయ మత్స్యకారుడి బతుకు వుంది!
పాలకులు జాలర్లను పట్టించుకోవాలి
వారి జీవనం రాదారి పడవల్లా సాగిపోవాలి..!

- జి. సూర్యనారాయణ, సెల్: 6281725659
(నేడు అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం)

ఎన్నికల్లో పోటీకీ.. జనాభా పెరుగుదలకు సంబంధం ఏమిటి?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పిడిఎఫ్ సభ్యులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్నా పిఎసిఎస్, డిసిసిబి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు, జనాభా పెరుగుదలకు సంబంధం ఏమిటని పిడిఎఫ్ సభ్యులు ఐ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. శాసనమండలిలో సహకారశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు బుధవారం ప్రవేశపెట్టిన సహకార సంఘాల చట్టం సవరణ బిల్లు (2024)పై చర్చ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ చట్టం సవరణ ఉద్దేశం జనాభా పెరుగుదల అని వివరించడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. పిల్లలను ఎక్కువ సంఖ్యలో కనాలంటే ఆ కుటుంబ పరిస్థితిని అనుసరించి భార్యాభర్తలు తీసుకోవాల్సిన నిర్ణయమన్నారు. పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ బిల్లును సమర్థిస్తున్నట్లు చెప్పారు. పిఎసిఎస్, డిసిసిబిలను పటిష్టపరచాలని కోరారు. గుంటూరు జిల్లాలో డిసిసిబిపై రూ.కోట్లలో అవినీతి జరిగినట్లు ఆరోపణలొచ్చాయని, వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇవి రైతులకు పూర్తి స్థాయిలో సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని శాఖల్లో, సంస్థల్లో ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచారని, సహకార సంస్థల్లో ఈ పరిమితి ఇంకా 60 ఏళ్లగానే ఉందని, ఈ శాఖ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని కోరారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. బిల్లును సమర్థిస్తున్నట్లు చెప్పారు. విశాఖ డెయిరీ ఆవు పాల సేకరణ ధర లీటరుకు రూ.2.60 చొప్పున తగ్గించడం జరిగిందని, ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ.. దేశంలో జనాభా పెరుగుదల సంఖ్య పడిపోవడంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటుందని, జనాభా పెరుగుదలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిసిసిబిల్లో అవినీతి ఆరోపణలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయని, విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖ డెయిరీ విషయంలో హౌస్ కమిటీ వేసినట్లు చెప్పారు. మండలి నుంచి కూడా ఈ కమిటీలో సభ్యులుంటారన్నారు. రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చేందుకు ఈ బిల్లులో సవరణ చేసినట్లు చెప్పారు.

పారదర్శకంగా నూతన మద్యం పాలసీ

- మంత్రి కొల్లు రవీంద్ర
- సెజ్ రద్దు, ప్రైవేటు విక్రయాల అనుమతి బిల్లులకు సభలో ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పారదర్శకంగా నూతన మద్యం పాలసీని తీసుకొచ్చినట్లు ఎక్సైజ్, గనులు, భూగర్భ వనరులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఎక్సైజ్ పాలసీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) రద్దు, ప్రైవేటు దుకాణాల్లో మద్యం విక్రయాలకు అవకాశం కల్పిస్తూ మంత్రి శాసనసభలో బుధవారం బిల్లులు ప్రవేశపెట్టారు. అవి ఆమోదం పొందాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖను పునర్ వ్యవస్థీకరించినట్లు తెలిపారు. సింగిల్ లైన్ ఆఫ్ కంట్రోల్‌ను పునరుద్ధరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాలు అత్యంత పారదర్శకంగా లాటరీ ద్వారా కేటాయించబడ్డాయని చెప్పారు. గీత కులాలకు 10 శాతం మద్యం దుకాణాలు రిజర్వు చేశామని, డిసెంబర్‌లో ఈ షాపులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని అన్నారు. ప్రధాన నగరాల్లో 12 ప్రీమియం షాపులు ఏర్పాటుకు పాలసీ రూపొందించామన్నారు. మద్యం, బీర్ సరఫరాను ఆటోమేటెడ్ ఆర్డర్ ఫర్ సప్లై (ఒఎఫ్ఎస్)లోకి మార్చామన్నారు. ప్రైవేటు షాపులకు మద్యం రిటైల్ షాపులు కేటాయించడం ద్వారా కొనుగోలులో వినియోగదారుల ఎంపికకు ప్రాధాన్యత, మార్కెటింగ్ ఆధారిత ఆధారంగా మద్యం డిమాండ్, సరఫరా జరుగుతోందన్నారు.

బుడమేరు ప్రక్షాళన ఎప్పుడు?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆపరేషన్ బుడమేరును ఎప్పుడు ప్రారంభిస్తారని శాసనమండలిలో రాష్ట్ర ప్రభుత్వాన్ని వైసిపి సభ్యులు మొండితోక అరుణకుమార్ ప్రశ్నించారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా అరుణకుమార్‌తో పాటు సభ్యులు మహ్మద్ రుహుల్లా ఈ అంశాన్ని లేవనెత్తారు. 'ఆపరేషన్ బుడమేరు' ప్రారంభించి నెలలో ఆధునీకరిస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు ప్రకటించారని అరుణకుమార్ గుర్తుచేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ..కౌలుదారులకు, ఆటో కార్మికులకు పరిహారం అందలేదని, వారికి కూడా సాయం అందించాలని కోరారు. వరద నీటిలో మునిగి ఉండడం వల్ల సింగ్‌నగర్, జక్కంపూడి, కండ్రిక ప్రాంతాల్లో విద్యా సంస్థల గోడలు బలహీనంగా మారాయని, వాటిని ప్రత్యేకంగా నిర్మించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నంలో ఉన్న విద్యుత్ ప్లాంట్‌ను కాపాడేందుకు వరద నీటిని దారిమళ్లించడం వల్ల విజయవాడ నీటమునిగిందా? అని ప్రశ్నించారు. స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. మహ్మద్ రుహుల్లా మాట్లాడుతూ.. ఇంకా ఎంత మంది బాధితులకు పరిహారం ఇవ్వాల్సి ఉందో చెప్పాలని కోరారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. బుడమేరు ఆక్రమణలను నిరోధించి చెప్పారు. దీనికి సమాంతరంగా పాత చానెల్‌ను అభివృద్ధి చేయాలని చూస్తున్నామన్నారు. అయితే ఇందులో మూడు వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. టిడ్కో ఇళ్ల మాదిరి నిర్మించి వీళ్లను అక్కడికి తరలించే ఆలోచన చేస్తున్నామన్నారు. బాధితుల సహాయంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పలేదు.

రాధాకృష్ణ విద్యుత్ ప్లాంటును కాపాడేందుకేనా..

బుడమేరు కెనాల్‌పై ఎబిఎన్ సంస్థ అధినేత వేమూరి రాధాకృష్ణకు చెందిన విద్యుత్ ప్లాంట్ ఉందని, దీనిని కాపాడేందుకు చూస్తున్నారని అరుణకుమార్ విమర్శించారు. మంత్రులు, అధికార పార్టీ వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో లేని వ్యక్తుల గురించి ఎలా ప్రస్తావిస్తారని, రికార్డుల్లో నుంచి ఆ పదాలు తొలగించాలని మంత్రులు నారా లోకేష్, డోలా బాలవీరాంజనేయస్వామి, సవిత నిరసన వ్యక్తం చేశారు. ఆ పదాలు తొలగించాలని ఛైర్మన్ స్థానంలో కూర్చున్న వి చిరంజీవిరావు చెప్పారు.

లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతిక శుక్లాను ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఇప్పటికే వేల సంఖ్యలో లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కన్వర్షన్ ద్వారా భర్తీ చేయడం లేదని చెప్పారు. వీటిని భర్తీ చేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అతిథి లెక్చరర్ల పేరుతో 975 మందిని తీసుకుని నెలకు రూ.10 వేలు ఇచ్చి బానిసలుగా మార్చే ప్రయత్నాలు తక్షణమే విరమించుకోవాలని తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని కోరారు.

కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర స్థాయి కానిస్టేబుల్ నియామకాల్లో భాగంగా రెండోదశ దరఖాస్తులకు ఈ నెల 21 వరకు ఉన్న గడువును ఈ నెల 28 వరకు పొడిగిస్తున్నట్లు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. 2022లో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుబంధంగా రెండో దశలో ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 11 నుంచి 21 వరకు అవకాశం ఇచ్చారు. అభ్యర్థుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.



చైనా రక్షణ మంత్రి డంగ్ జున్‌తో రాజ్‌నాథ్ సింగ్ కరచాలనం

భారత్, చైనా రక్షణ మంత్రుల భేటీ

న్యూఢిల్లీ : చైనా రక్షణ మంత్రి డంగ్ జున్, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. లావోస్ రాజధాని నగరం వియంటియాన్‌లో బుధవారం జరిగిన ఈ సమావేశంలో ఇరుదేశాలు 2020 నాటి 'సరిహద్దు ఘర్షణలు' నుంచి పాఠాలు నేర్చుకోవాలని, పరస్పర విశ్వాసం - అవగాహనను పునర్నిర్మించడానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోవాలని నిర్ణయించాయి. ఈ వివరాలను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ - చైనాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ప్రపంచశాంతి - శ్రేయస్సుకు దోహదపడతాయని రాజ్‌నాథ్ సింగ్ ఈ సమావేశంలో పేర్కొన్నారు. భారత్ - చైనాలు వివాదాల కంటే సహకారంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపింది. ఎఎస్ఇఎఎన్ దేశాల రక్షణ మంత్రుల సమావేశం నేపథ్యంలో రాజ్‌నాథ్‌సింగ్ - డంగ్‌జున్ మధ్య సమావేశం జరిగింది. లావోస్‌లో రాజ్‌నాథ్‌సింగ్ మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. జి20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా సోమవారం బ్రెజిల్‌లోని రియో డిజెనిరోలో భారత్, చైనా విదేశాంగ మంత్రులు జైశంకర్, వాంగ్ యి సమావేశమైన సంగతి తెలిసిందే.

సివిల్ సప్లయిస్ హమాలీల కూలిరేట్లు పెంచాలి

- జెఎసి ఆధ్వర్యాన ధర్నా
- చర్చలకు ఆహ్వానించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పౌరసరఫరాల శాఖలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు కూలిరేట్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. హమాలీ సంఘాలతో సంప్రదింపులు జరపకుండా ఏకపక్ష నిర్ణయాలు చేయడం సబబుకాదని నాయకులు పేర్కొన్నారు. 11 నెలలుగా కూలిరేట్లు పెంచకపోవడాన్ని నిరసిస్తూ ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ (సిఐటియు), ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) సంయుక్తంగా విజయవాడలోని ఆటోనగర్‌లో సివిల్ సప్లయిస్ ఎమ్‌డి కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు చుక్కలంటుతున్నాయని, కూలిరేట్లు పెంచకుండా హమాలీలను కష్టాలు పాలుచేయడం తగదన్నారు. హమాలీల వేతన బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదని, కొన్నిచోట్ల మంచినీటి సౌకర్యం కల్పించడం లేదని విమర్శించారు. కూలిరేట్లు పెంచుతూ జీఓ జారీ చేయకపోతే భవిష్యత్‌లో నిరవధిక సమ్మెకు పూనుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎఐటియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. 11 నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వాలు కూలిరేట్లు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా బోనస్, స్టిచ్చింగ్ ఛార్జీలతో సహా అన్ని ధరలూ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎ నాగరాజు, ఎఐటియుసి నాయకులు చిన ఆంజనేయులు, సిఐటియు అనుబంధ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ కృష్ణ, ఎస్ ఉదయ భాస్కరరావు, నాయకులు నాగరాజు, శేఖర్, శివశంకర్, మెజెస్, ఎఐటియుసి అనుబంధ సంఘ నాయకులు మస్తురరావు, అంజి, వీరబాబు, ఎఫ్ఎస్‌సిఐఎల్ హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం మదన్‌మోహన్ తదితరులు ప్రసంగించారు. అనంతరం పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి మనజీర్ జిలాని సమూన్‌కు జెఎసి నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం నాయకులను చర్చలకు ఆహ్వానిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయం నుంచి జెఎసి నాయకులకు సమాచారం అందింది. ఈ మేరకు గురువారం చర్చలు జరిగేవీలుంది.

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.పది వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి తీర్పు ఇచ్చారు. బాపట్ల జిల్లా, చిన్నగంజాం మండలం సంతరావూరు మాదిగ పల్లెలో రెండో తరగతి చదువుతున్న బాలికపై 2018 ఫిబ్రవరి 20న పాఠశాల వద్ద ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన 57 ఏళ్ల వృద్ధుడు చిన్నప్పయ్య అత్యాచారం చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం నుండి రూ.ఏడు లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

564 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లోని టాయిలెట్సును నిత్యం పరిశీలించి వాటి శుభ్రత ఎలా ఉందనే అంశంపై ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అందుకు భిన్నంగా వ్యవహరించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టరు శివప్రసాద్ బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ఫొటోలు తీయని 564 మందిని గుర్తించినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆయా ఉద్యోగుల పేర్లు, ఏ సచివాలయ పరిధి వంటి వివరాలు కూడా ఉత్తర్వుల్లో పేర్కొనడం చర్చనీయాంశమైంది.

డైట్ కళాశాలలు బలోపేతం

- ఎస్ఇఆర్‌టి డైరెక్టరు ఎంవి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డైట్ కళాశాలలను బలోపేతం చేయడం ద్వారా ప్రాథమిక విద్యలో మెరుగైన ఫలితాలను సాధించొచ్చునని ఎస్ఇఆర్‌టి డైరెక్టరు ఎంవి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. డైట్ కళాశాలను పరిపుష్టి చేయాలన్న సదుద్దేశంతో విజయవాడలోని ఎస్‌సిఆర్‌టి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యకు పునాది బలపడాలంటే డైట్ కళాశాలల పాత్ర మెరుగుపడాలన్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, పాఠశాల విద్యలో పరిశోధనలు గావించడం, బోధన అభ్యసన పద్ధతులను రూపొందించడంలోనూ, నూతన విద్యా విధానాలను అమలుపరచుటలో జిల్లా విద్యా శిక్షణ సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయని, వాటిని మరింత బలోపేతం చేయడం అవసరం అని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ కోటా పెంపునకు కేబినెట్ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్పోర్ట్స్ కోటాను ప్రస్తుతం ఉన్న రెండు శాతం నుంచి మూడు శాతానికి పెంచేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అలాగే పర్యాటక విధానానికి కూడా ఆమోదముద్ర వేశారు. వీటితోపాటు ఎపి టవర్ కార్పొరేషన్ ఫైబర్‌గ్రిడ్‌లో విలీనం, కాంట్రాక్టర్లకు మొబలైజేషన్ అడ్వాన్స్‌ల పునరుద్ధరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సాంప్రదాయక క్రీడలకు ప్రోత్సహకాలు ఇవ్వాలని, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సూచన చేశారు. కల్చరల్ హెరిటేజ్ టెక్స్‌టైల్ టూరిజంతో పాటు సేఫ్టీ పాలసీపైన కూడా ఆయన పలు సూచనలు చేసినట్లు సమాచారం. కాగా లోకాయుక్త చట్ట సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ లోకాయుక్త నియామకంలో ప్రతిపక్షనేత లేనప్పుడు ఏమి చేయాలనే దానిపై కొద్ది సేపు చర్చ జరిగినట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్‌లో అనుసరించిన విధానమే కొనసాగించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

వక్ఫ్‌బోర్డు సవరణల బిల్లును వ్యతిరేకిస్తూ 24న రౌండ్‌టేబుల్

- లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డ్ సవరణల బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో బహిరంగ సభ జరుగుతుందని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్, శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, వేదిక చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన జరిగే ఈ బహిరంగ సభలో ఇండియా వేదిక నేతలైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల హాజరవుతారని, ముస్లిం మత పెద్దలను ఆహ్వానిస్తామని తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డ్ సవరణలు అత్యంత ప్రమాదకరమైనవని, ముస్లిముల సంక్షేమానికి, సంస్థ మనుగడకు పెను ప్రమాదమని లక్ష్మణరావు, విల్సన్ పేర్కొన్నారు. పేద ముస్లిం మహిళలు, అనాథ బాలబాలికలు, వితంతువుల సంక్షేమానికి వినియోగించాల్సిన నిధులు పక్కదారిపడతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వక్ఫ్‌బోర్డు సవరణలను వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న బహిరంగ సభలో లౌకికవాదులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వర్రా అరెస్టు కేసులో పోలీస్ ఉన్నతాధికారులకు నోటీసులు

- ప్రతివాదులుగా చేర్చేందుకు హైకోర్టు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

వర్రా రవీందర్‌రెడ్డి అరెస్టుపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో పోలీసు అధికారులను ప్రతివాదులుగా చేర్చడాన్ని ప్రభుత్వం తరపున ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ వ్యతిరేకించారు. రవీందర్‌రెడ్డి భార్య కళ్యాణి, ప్రత్యక్ష సాక్షిగా చెబుతున్న మూడో వ్యక్తి వేసిన అఫిడవిట్‌లో అధికారులపై అభియోగాలకు ఆధారాల్లేవన్నారు. ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేర్చితే పోలీస్ వ్యవస్థకు మంచిది కాదన్నారు.

ఎస్‌పి, డిఐజిలను ప్రతివాదులుగా చేర్చడానికి వీల్లేదన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాల్సిన బాధ్యత ఎస్‌హెచ్‌ఒపై ఉంటుందని చెప్పారు. పోలీసులపై నిరాధార ఆరోపణలు చేయడం పిటిషనర్లకు తగదన్నారు. ప్రతివాదిగా ఉన్నతాధికారులు అఫిడవిట్లు వేస్తే సరిపోతుందని హైకోర్టు అభిప్రాయపడింది. డిఐజి కర్నూలు, కడప ఇన్‌ఛార్జి ఎస్‌పి, జమ్మలమడుగు సిఐ, దర్యాప్తు అధికారిని ప్రతివాదులుగా చేర్చాలని అభ్యర్థిస్తూ పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించి వాళ్లకు నోటీసులిచ్చింది. వర్రా రవీందర్‌రెడ్డిని పోలీసులు ఈ నెల 8న అరెస్టు చేశారనేందుకు పుల్లూరు టోల్ ప్లాజా సిసిటివి ఫుటేజీని సమర్పించినట్లు పిటిషనర్లు చెబుతున్నందున ఆ ఫుటేజీని భద్రం చేయాలని ఎస్‌హెచ్‌ఒకు ఆదేశాలిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ నెల 29న విచారిస్తామని జస్టిస్ ఆర్ రఘునందనరావు, జస్టిస్ కె మహేశ్వరరావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.

తన భర్త రవీందర్‌రెడ్డిని పోలీసులు తీసుకుపోయారని, ఆచూకీ తెలియడం లేదంటూ కళ్యాణి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో పోలీసులు రెడ్డి తమ ఆధీనంలో లేరని ఒకసారి, ఆ తర్వాత విచారణలో అరెస్టు చేశామని మరోసారి చెప్పారు. తమ ఎదుట రవీందర్‌రెడ్డిని హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించాక కింది కోర్టులో హాజరుపర్చడంపై రెడ్డి తరపున న్యాయవాది తీవ్ర అభ్యంతరం చెప్పారు. ఈ నేపథ్యంలో బుధవారం పైవిధంగా విచారణ జరిగింది.

నిందితులకు వెంటనే రిమాండ్ రిపోర్టు


- హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఏదైనా కేసులో నిందితుడిని కోర్టు రిమాండ్ చేసినప్పుడు ఆ కారణాలతో కూడిన రిమాండ్ ఆర్డర్ కాపీని ఇవ్వాలని నిందితుడు కోరితే వెంటనే ఇవ్వడం పౌరహక్కుల రక్షణ కిందకు వస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. పౌరుల హక్కులతో ముడిపడి ఉన్న కేసుల్లో కింది కోర్టులు ఈ విషయంలో మరింత క్రియాశీలకంగా ఉండాలని సూచించింది. సోషల్ మీడియా యాక్టివిస్ట్ పి వెంకటరామిరెడ్డి అరెస్టు కేసులో సమగ్ర వివరాలు అందజేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ నెల 29న తిరిగి విచారిస్తామని జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కె మహేశ్వరరావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం వెల్లడించింది. రిమాండ్ కాపీ కోసం పిటిషనరు సంబంధిత కోర్టులో దరఖాస్తు చేసిందీ.. లేనిదీ తెలుసుకుని చెప్పాలని ఆయన తరపున న్యాయవాదిని ఆదేశించింది. తన కొడుకు వెంకటరామిరెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ చెలమారెడ్డి తరపున సీనియర్ అడ్వకేట్ సుబ్రహ్మణ్య శ్రీరామ్, న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదించారు. వెంకటరామిరెడ్డిని కింది కోర్టులో హాజరుపర్చినందున హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. తదుపరి విచారణ 29కి వాయిదా పడింది.

150 రోజుల పాలనలో ప్రభుత్వంపై విశ్వాసం

- మరో పదేళ్లు ముఖ్యమంత్రి చంద్రబాబే
- అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

150 రోజుల కూటమి పాలనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ఆయన నాయకత్వ ప్రతిభను చాటుతోందని, అందరిలోనూ ప్రభుత్వంపై భరోసా నింపిందని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీకి తగ్గట్టుగా పనిచేస్తామని, శాఖల పరంగా తాము చేయాల్సిన పనులను సూచిస్తే వాటిని చేపట్టి రాష్ట్ర ప్రజల కలలను, ఆకాంక్షలను నెరవేర్చుతామని అన్నారు. ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందనే విశ్వాసం పెరిగిందని చెప్పారు మరో పదేళ్లు చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతిభద్రతల విషయంలో ముగ్గురు ఐపిఎస్‌లను సస్పెండ్ చేయడం చంద్రబాబు ధైర్యాన్ని చాటుతోందని, గంజాయిని ఉక్కుపాదంతో అణచి వేస్తామని చెప్పడం నవ్వార్తిదాయకంగా ఉందన్నారు. రాష్ట్రం కోసం త్యాగం చేసిన ఎల్లాప్రగడ సుబ్బారావు, డొక్కా సీతమ్మ తదితరుల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టామన్నారు. రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని, ఆయన బలిదానం చేసిన రోజును, వాసవీ కన్యకాపరమేశ్వరి బలిదానం చేసిన రోజును అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలన్నారు.

జగన్ పాలనలో టోకరా పథకాలు

- ఎమ్మెల్యే సోమిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

150 రోజుల చంద్రబాబు పాలనలో ప్రభుత్వంపై తిరిగి నమ్మకం ఏర్పడిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన ద్రవ్య వినిమయ బిల్లుపై ఆయన మాట్లాడారు. వివిధ శాఖలకు కేటాయింపులకు, ఖర్చుకు సంబంధం ఉండేది కాదని, బడ్జెట్‌పై నమ్మకం కోల్పోయామని పేర్కొన్నారు. జగన్ జల్సా పథకాలకు, టోక్రా పథకాలకు వేలాది కోట్లు వృథా చేశారని విమర్శించారు. గత ముఖ్యమంత్రులందరూ కలిపి ఎంత అప్పు చేశారో ఐదేళ్ల జగన్ పాలనలోనే అంత అప్పు చేశారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు రూ.240 కోట్లు దారిమళ్లించారని తెలిపారు. కేంద్ర సబ్సిడీ పథకాలను ఉపయోగించలేదన్నారు. గృహ నిర్మాణ పథకంలో ఒక్క నెల్లూరు జిల్లాలోనే రూ.120 కోట్ల అవినీతిని గుర్తించినట్లు చెప్పారు.

అరాచకాన్ని అణచాలి
- ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

ఈ చర్చలో మరో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. అరాచకాన్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల ముసుగులో కొందరు దుర్మార్గమైన పోస్టులు పెడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవడాన్ని కొనసాగించాలన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆర్థిక క్రమశిక్షణ

- మంత్రి పయ్యావుల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆ దిశగా ప్రతిఒక్క అంశంలో మార్పు మొదలైందన్నారు. ద్రవ్య వినిమయ బిల్లు సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టసభల ఆమోదంతోనే ప్రభుత్వం వివిధ అవసరాలకు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఈ నిబంధనకు విరుద్ధంగా రూ.600 కోట్లకుపైగా ఖర్చు చేసిందని చెప్పారు. ఈ విధానాన్ని అప్పట్లో ప్రతిపక్ష సభ్యులుగా తాము సభలో అడ్డుకున్నామని, లేకపోతే మరో 20 ఏళ్లకు సరిపడా గత ప్రభుత్వం అప్పులు చేసేదని అన్నారు.

అనుచిత విమర్శలు తగవు

- గుంటూరు మేయర్ వ్యాఖ్యలపై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

గుంటూరు నగర్ మేయర్ కావటి మనోహర్ నాయుడు అనుచితంగా మాట్లాడిన తీరును హైకోర్టు తప్పుపట్టింది. రాజకీయంగా విబేధిస్తే ఆ మేరకు విధానాలు, నిర్ణయాలపై విమర్శలు చేయాలేగానీ అసభ్య పదజాలంతో మహిళలు, కుటుంబ సభ్యులపై విమర్శలు చేయడం దారుణమని ఆగ్రహించింది. అలాంటి పదజాలాన్ని మీడియా, సోషల్ మీడియాలో రాకుండా ఉండి ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది. దీనిపై సమగ్ర వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశించింది. పోలీసులు నమోదుచేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షపడేవే అయినందున నిందితుడికి సిఆర్‌పిసి సెక్షన్ 41(ఏ) కింద నోటీసులివ్వాలని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులిచ్చింది. విచారణను 6 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఆదేశాలిచ్చారు. విపక్ష నేతగా చంద్రబాబు ఉన్నప్పుడు అరెస్టయిన నేపథ్యంలో నిరసన తెలుపుతుంటే గుంటూరు నగర మేయర్ కావేటి మనోహర్ నాయుడు నోటికి వచ్చినట్లుగా పవన్‌కల్యాణ్, లోకేష్‌పై విమర్శలు చేశారంటూ టిడిపి నేత కనపర్తి శ్రీనివాసరావు అరండల్‌పేట పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని మేయర్ నాయుడు దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు పైవిధంగా అభిప్రాయపడింది.

బార్గవ్‌రెడ్డిపై కేసుల వివరాలివ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

సిఎం చంద్రబాబు, ఇతరులపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారంటూ వైసిపి సోషల్ మీడియా పూర్వపు ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్ రెడ్డిపై పెట్టిన కేసుల వివరాలు నివేదించాలని పోలీసులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా, ప్రకాష్‌నగర్ పోలీసులు, శ్రీసత్యసాయి జిల్లా, రొద్దం పోలీసులు పెట్టిన కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ బార్గవ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 22కు వాయిదా వేశారు.

నందిగం పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై 2023 మార్చిలో జరిగిన దాడి కేసులో తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం చెల్లదంటూ మాజీ ఎంపి నందిగం సురేష్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ ఈ నెల 25కు వాయిదా పడింది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ మల్లికార్జునరావు బుధవారం విచారణ జరిపారు. సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదిస్తూ.. ఇదే తరహాలో మరో పిటిషన్ సోమవారం విచారణకు వస్తుందన్నారు. అన్నింటినీ కలిపి విచారిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

విశాఖ డెయిరీపై తీర్మానం హర్షణీయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ డెయిరీ ఆవు పాల ధరను తగ్గించిన నేపథ్యంలో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. దీనిపై బుధవారం నాయకులు బి రాంబాబు, కె అజయ్‌కుమార్ ప్రకటన విడుదల చేశారు. డెయిరీలో ఆవు పాలను లీటరుకు నాలుగు రూపాయలు తగ్గించారని తెలిపారు. దీనిపై సంఘం ఆందోళన చేసిందన్నారు. స్పందించిన యాజమాన్యం సమయం కావాలని కోరిందని తెలిపారు. దీనిపై అన్నిచోట్లా ఆందోళనలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి అక్రమాలపై సభా సంఘం వేసిందని వారు పేర్కొన్నారు.

కెప్టెన్ల సమస్యలు పరిష్కరించండి

- ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్ల (డ్రైవర్లు) సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఎన్‌టిఆర్ వైద్య సేవ అదనపు సిఇఒ అప్పారావును యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు బసవరాజు కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో 500 మంది కెప్టెన్లు పనిచేస్తున్నారని, వీరికి నెలకు కేవలం 8,800 మాత్రమే వేతనాన్ని చెల్లిస్తున్నారని, సిటిసి పేరిట యాజమాన్యం చెల్లించాల్సిన పిఎఫ్ వాటా కూడా ఉద్యోగుల వేతనం నుంచే మినహాయిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్లు చెప్పారు. వీరికి కనీస వేతనమైన రూ.18,500 చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ రుసుము యాజమాన్యమే చెల్లించాలని కోరారు. చట్ట ప్రకారం వీక్లీ ఆఫ్‌లు, పండగ, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా 104లో విధులు కేటాయించకూడదని కోరారు. హైరిస్క్ ప్రెగ్నెంట్ ఉమెన్, సివియర్ ఎనీమిక్ ప్రెగ్నెంట్ ఉమెన్ సేవలకు అదనపు వేతనం చెల్లించాలన్నారు. ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ప్రమాదాల్లో మరణించిన కెప్టెన్లకు బీమా సౌకర్యం కల్పించాలని, రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలన్నారు. దహన సంస్కారాలకు ఖర్చులు చెల్లించాలని కోరారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు.

సీలేరు - విశాఖ మధ్య సీ ప్లేన్

ప్రజాశక్తి-సీలేరు

విజయవాడ నుంచి శ్రీశైలం వరకు వినియోగంలోకి తీసుకురానున్న సీ ప్లేన్‌ను సీలేరు-విశాఖపట్నం మధ్య ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేపట్టారు. సీ ప్లేన్ సీలేరు నదిపై అనుకుమా లేదా అన్నదానిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జికె వీధి తహశీల్దారు రామకృష్ణ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. స్థానిక మారెమ్మ ఆలయం ఎదురుగా ఉన్న స్నానపు ఘాటు మెయిన్ డ్యామ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దారు రామకృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు సీ ప్లేన్ ప్రయాణానికి అనుకూలంగా ఉందని నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

రామ్మూర్తి నాయుడుకు శాసనసభ ఘన నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడుకు శాసనసభ బుధవారం ప్రగాఢ సంతాపం తెలిపింది. స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రామ్మూర్తి నాయుడు 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి శాసనసభ్యులుగా నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన పలు సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారని తెలిపారు. రామ్మూర్తి నాయుడు కుటుంబానికి రాష్ట్ర ప్రజల తరపున శాసనసభ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేస్తూ ఘన నివాళి అర్పిస్తుందన్నారు. సంతాప తీర్మానం అనంతరం రామ్మూర్తి నాయుడు మృతి పట్ల సభకు రెండు నిమిషాలు మౌనం పాటించింది. సిఎం చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు సభకు హాజరయ్యారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త అధ్యాయం

- గుయానాలో ప్రధాని మోడీ పర్యటన

జార్జి టౌన్, గుయానా : గత 50ఏళ్ల కాలంలో మొట్టమొదటి సారిగా భారత దేశ ప్రధాని గుయానాలో పర్యటిస్తున్నారు. రీయో డీ జెనీరో నుండి బుధవారం తెల్లవారు జామున ఇక్కడకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ఇక్కడి భారతీయులను కలుసుకున్నారు. వీరిలో చాలా కుటుంబాలు 180ఏళ్ల క్రితం ఇక్కడకు వలస వచ్చేసినవే. గుయానాలో దాదాపు 3,20,000మంది భారతీయ సంతతి వున్నారు. వీరు కాకుండా రెండు వేల మంది వరకు భారత జాతీయులు వున్నారు. వివిధ రంగాలకు చెందిన వారిని ఇలా కలుసుకోవడం తనకు చాలా సంతోషంగా వుందని మోడీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వివిధ రంగాల్లో భారతీయ సంతతి చేస్తున్న కృషిని మోడీ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక్కడకు వచ్చిన వెంటనే మోడీకి భారతీయులు సాదరంగా స్వాగతం పలికారు. చేతుల్లో భారతీయ పతాకాలను చేబూని సాంప్రదాయ వస్త్రధారణలో వచ్చారు. తొలుత ప్రధాని మోడీకి విమానాశ్రయంలో అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, ప్రధాని మార్క్ ఆంథోనీ ఫిలిప్స్ సహా పలువురు మంత్రులు ఘన స్వాగతం పలికారు. అపారమైన చమురు నిల్వల కారణంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా గుయానా వుంది. రక్షణ, భద్రత, ఇంధనం, మౌలిక వసతులు, వాణిజ్యం వంటి రంగాల్లో సహకారానికి గణనీయమైన అవకాశాలున్న నేపథ్యంలో గుయానాలో మోడీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

అరోరా ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం

- కార్మికుడు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో గల అరోరా ఫార్మా కంపెనీలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒక కార్మికుడు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరోరా ఫార్మా కంపెనీలోని బాయిలర్‌ను శుభ్రం చేస్తున్న క్రమంలో సాల్వెంట్ ఫైర్ కావడంతో అనిల్ (43) అనే కార్మికుడు మృతి చెందారు. గోపి, శ్రీనివాస్, బలరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఫార్మా సిబ్బంది వెంటనే వారిని సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఫార్మా కంపెనీని నడుపుతున్న యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబీకులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. యాజమాన్యం స్పందించకపోవడంతో ఫార్మా కంపెనీ ముందు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫైర్ సిబ్బందికి సైతం సమాచారం ఇవ్వలేదని జీడిమెట్ల స్పెషల్ ఫైర్ ఆఫీసర్ శంకర్ రెడ్డి తెలిపారు. సూరారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



ఎఐతో నిరుద్యోగ ముప్పు

- అభివృద్ధి చెందిన దేశంగా మారడం భారత్‌కు అంత సులభం కాదు..
- ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రంగరాజన్

చెన్నయ్ : వచ్చే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా హోదాను పొందడం అంత సులభమేమీ కాదని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ సి రంగ రాజన్ అన్నారు. చెన్నయ్‌లో ఏర్పాటు చేసిన జి రామచంద్రన్ స్మారకోపన్యాసంలో రంగరాజన్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయం 14,000 డాలర్లుగా ఉంటే.. భారతీయుల తలసరి ఆదాయం 2500 డాలర్ల వద్దే ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో భౌగోళిక రాజకీయ అవాంతరాలు, కృత్రిమ మేధస్సు వల్ల ఉత్పన్నమయ్యే అనిశ్చితి వంటి అనేక సవాళ్లను అధిగమించడమూ సులభం కాదన్నారు భారతీయుల తలసరి ఆదాయం ఏడు రెట్లు పెంచాలంటే.. ఏడాదికి సగటున కనీసం 10 శాతం వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే 25 ఏళ్లలో ఆ స్థాయి వృద్ధి రేటు కష్టమన్నారు.

ప్రపంచ వాణిజ్యం పురోగమిస్తున్న సమయంలో చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ఇక ఆస్థాయిలో ప్రపంచ వృద్ధి ఉండకపోవచ్చన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ దిగుమతి సుంకాల పెంపునపై అనుసరిస్తున్న వైఖరిని దృష్టిలో ఉంచుకుని ప్రపంచ వాణిజ్యంలో పెద్దగా ఉత్సాహం కొనసాగకపోవచ్చని రంగరాజన్ సందేహం వ్యక్తం చేశారు. ఎఐతో నైపుణ్యాల స్థాయి ఉద్యోగాలను సృష్టించగలమేమో కానీ.. దాంతో పెద్ద ఎత్తున నిరుద్యోగానికి దారి తీయొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు విస్తృతమైన విధానాలు మాత్రమే కాకుండా వ్యక్తిగత పరిశ్రమలు ఎదుర్కొంటున్న అవరోధాలను తొలగించే పాలసీని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రమాదంలో పిల్లల భవితవ్యం!

- వంద కోట్ల మంది చిన్నారులకు 'పర్యావరణ' ముప్పు
- యునిసెఫ్ హెచ్చరిక



న్యూఢిల్లీ : మరే ఇతర తరాల్లోనూ అనుభవించనటువంటి అత్యంత ప్రమాదకరమైన, అనూహ్యమైన పర్యావరణాన్ని నేటి తరం పిల్లలు ఎదుర్కోనున్నారని యునిసెఫ్ హెచ్చరించింది. వాతావరణ మార్పులు అత్యంత తీవ్రంగా వున్న, పర్యావరణ ప్రమాదాలు జరిగే ముప్పు వున్న దేశాల్లో దాదాపు వంద కోట్ల మంది పిల్లలు నివసిస్తున్నారని పేర్కొంది. బుధవారం ఈ నివేదికను విడుదల చేశారు. జనాభా మార్పులు, వాతావరణ, పర్యావరణ సంక్షోభాలు, అత్యంత కీలకమైన సాంకేతికతలు ఈ మూడు కీలకమైన శక్తుల ప్రభావాన్ని ఈ నివేదిక సవివరంగా పరిశీలించింది. ఇప్పటి నుండి 2050 మధ్య కాలంలో పిల్లల జీవితాలపై ఈ మూడు అంశాలు తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తాయని పేర్కొంది. అంతర్జాతీయంగా అస్థిర వాతావరణం, జీవ వైవిధ్యత కుప్పకూలడం, విస్తృత స్థాయిలో కాలుష్యం పెచ్చరిల్లుతున్నాయని హెచ్చరించింది. గతంలో మరే తరం పిల్లలు కూడా ఇటువంటి పరిస్థితులను, ముప్పును ఎదుర్కొనలేదని, కానీ నేటి తరం పిల్లలకు ఇదే ప్రధాన సమస్యగా మారనుందని హెచ్చరించింది. ఎదుగుతున్న పిల్లల శరీరాలు ప్రత్యేకంగా ఈ ప్రమాదాలకు గురవుతాయని తెలిపింది. భూమిపై పడిన మొదటి క్షణం నుండి పిల్లల మెదళ్లు, ఊపిరితిత్తులు, రోగ నిరోధక వ్యవస్థలు ఇలా అన్నీ తీవ్రంగా కలుషితమవుతాయని పేర్కొంది. పీల్చే గాలిలోని కాలుష్యం వారిని బాగా దెబ్బతీస్తుందని నివేదిక హెచ్చరించింది. వారి శ్వాసకోశ ఆరోగ్యంపై పడే ప్రభావం జీవిత కాలమూ వుంటుందని పేర్కొంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల దోమల ఉత్పత్తి పెరుగుతుంది. మలేరియా, డెంగ్యూ, జికా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వరదలతో నీరు కలుషితమవుతుంది. దాంతో నీటిలో బ్యాక్టీరియా వృద్ధి చెంది వ్యాధులు సంక్రమిస్తాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో ఇవే ప్రధాన ముప్పు కానుందని నివేదిక హెచ్చరించింది. పైగా వాతావరణ సంబంధిత విపత్తులు పిల్లల్లో ఆందోళన, కుంగుబాటు, నిస్సహాయత వంటి లక్షణాలను పెంచుతాయని పేర్కొంది.

పోలింగ్ ప్రశాంతం : ఇసి

- పలుచోట్ల దాడులు.. బెదిరింపులు...

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు 15 రాష్ట్రాల్లో ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించారని తెలిపింది.



ఓటు హక్కును వినియోగించుకున్న ఉద్దవ్ థాకరే, ఏకనాథ్‌షిండే, శరద్‌పవార్

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ముంబయిలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గవర్నర్ సిపి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సిఎం, ఎన్‌సిపి అభ్యర్థి అజిత్ పవార్, బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్, ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తన కుమారులు ఆకాశ్ అంబానీ, అనంత్ అంబానీ, కోడలు శ్లోకా మెహతాతో కలిసి ఓటు వేశారు. శివసేన అధినేత ఉద్దవ్ థాకరే, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, ఎంపి సుప్రియా సూలే తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తన కుటుంబంతో సహా ఓటు వేశారు. బాలీవుడ్ దర్శకుడు కబీర్ ఖాన్, సినీ నటుడు రాజ్ కుమార్ రావ్, నటి గౌతమీ కపూర్, నటులు అక్షయ్ కుమార్, అలీఫజల్, దర్శకుడు ఫర్హాన్ అకర్త్, జొయా అక్తర్, రష్మీ నిగమ్, సోను సూద్, సీనియర్ నటి సుభా ఖొటే కూతురుతో వచ్చి ఓటు వేశారు. నటులు మాధురీ దీక్షిత్, రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ, అర్జున్ కపూర్, ప్రేమ్ చోప్రా, సింగర్ కైలాశ్ ఖేర్, సునీల్ శెట్టి, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా, సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ ఖాన్, పూనమ్ దిల్లాన్, జునైద్ ఖాన్, జావెద్ అక్తర్, మనీశ్ మల్హోత్ర, సింగర్ శంకర్ మహదేవన్, డైరెక్టర్ రోహిత్ శెట్టి తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కొన్ని చోట్ల దాడులు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పలు చోట్ల పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద దాడులు జరిగాయి. మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవర్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) వర్గానికి చెందిన ఛగన్ భుజబల్ ఒకే పోలింగ్ బూత్‌లోకి అనేకసార్లు వెళ్లడంతో శరద్ పవార్ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. నాసిక్‌లోని యెవ్లా నియోజకవర్గం నుంచి ఛగన్ భుజబల్ పోటీ చేస్తున్నారు. ఒక పోలింగ్ బూత్‌లోకి ఎక్కువసార్లు వెళ్లేందుకు ఆయనకు ఎలా అనుమతి ఇస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిట్‌కాయిన్ కేసులో ఇడి సోదాలు

రాయ్‌పూర్ : బిట్‌కాయిన్ కేసులో సారధి అసోసియేట్స్ ఆడిట్ ఉద్యోగి గౌరవ్ మెహతా నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) బుధవారం సోదాలు నిర్వహించింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లోనూ సోదాలు కొనసాగుతున్నాయి. రాయ్‌పూర్‌లోని మెహతా స్థలాలు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) నిబంధనల పరిధిలోకి వస్తాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. 10 శాతం రిటర్న్‌లు ఇస్తామంటూ 2017లో ప్రజల నుంచి రూ.6,600 కోట్ల విలువైన నిధులను సేకరించడంలో మెహతా తదితరుల పాత్ర ఉందని పేర్కొన్నాయి.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం నిధులు సమకూర్చేందుకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి - శరద్‌పవార్) ఎంపి సుప్రియా సూలె, కాంగ్రెస్ నేత నానా పటోల్‌లు బిట్‌కాయిన్‌ను ఉపయోగిస్తున్నారని బిజెపి ఎంపి సుదాంసు త్రివేది, మాజీ ఐపిఎస్ అధికారి రవీంద్రనాథ్ పాటిల్ మంగళవారం ఆరోపించారు. ఈ ఆరోపణలపై సుప్రియా సూలే సైబర్ క్రైమ్‌కి ఫిర్యాదు చేసిన మరుసటి రోజు ఇడి సోదాలు నిర్వహించడం గమనార్హం. గౌరవ్ మెహతాతోపాటు పూణెకి చెందిన మాజీ ఐపిఎస్ అధికారి రవీంద్రనాథ్ పాటిల్ పేరు కూడా సుప్రియా ఫిర్యాదులో పేర్కొన్నారు.

బురదజల్లే ప్రయత్నం : సుప్రియా సూలే

కావాలనే తనపై బిజెపి ఎంపి సుధాంసు త్రివేది బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని సుప్రియా సూలే విమర్శించారు. ఎన్నికల్లో ఓటు వేసిన అనంతరం బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. బిజెపి విడుదల చేసిన ఆడియో క్లిప్‌లలో ఉన్నది తన వాయిస్ కాదని, ఆ స్క్రీన్ షాట్లు అన్నీ నకిలీవని, అదంతా బిజెపి కుట్ర అని చెప్పారు. ఎక్కడ సమాధానం చెప్పేందుకైనా సిద్ధమేనని తెలిపారు. ఈ అంశంపై ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్‌పవార్ మాట్లాడుతూ ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయగల సామర్థ్యం బిజెపికి మాత్రమే ఉందని అన్నారు.

ఉత్తర గాజా ఆస్పత్రిలో దారుణ పరిస్థితులు

- పోషకాహార లోపంతో చిన్నారులు
- బందీని తీసుకొస్తే 50లక్షల డాలర్లు బహుమతి : నెతన్యాహు
- లెబనాన్‌లో 100లక్ష్యాలపై దాడి

గాజా, బీరుట్ : గత నెలన్నర కాలంగా ఇజ్రాయిల్ దిగ్బంధంలో వున్న ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిలో పరిస్థితులు దారుణంగా వున్నాయి. పోషకాహార లోపంతో బాధపడుతున్న 17మంది చిన్నారులు ఆస్పత్రికి వచ్చారని, వారికి వైద్యం చేసేందుకు అవసరమైన ఔషధాలు లేవని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ హుస్సామ్ అబూ సఫియా పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 85మంది రోగులు మాత్రమే మిగిలారని తెలిపారు. పైగా ఆస్పత్రి భవనంపై ఇజ్రాయిల్ బలగాలు నిరంతరంగా కాల్పులు జరుపుతున్నాయని, వైద్యం చేసేందుకు, అసలు ఆస్పత్రికి వచ్చేందుకు ఎవరినీ అనుమతించడం లేదని చెప్పారు. మందులు లేవు, సిబ్బంది లేరు, ఆహారం లేదు, అంబులెన్సులు లేవు, పౌర రక్షణ దళాలు లేవు. పరిస్థితులు ఇంత దారుణంగా వున్నా తమకు సాయం అందించాలంటూ ఫోన్ కాల్స్ వస్తున్నాయని, కానీ ఏమీ చేయలేని నిస్సహాయతలో వుండిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డూ అదుపు లేకుండా కొనసాగే దాడుల్లో బతికి బయటపడిన వారు బతికినట్లేనని, ఎవరైతే దురదృష్టవశాత్తూ వుండిపోతారో వారు ప్రాణాలు కోల్పోయినట్లేనని వ్యాఖ్యానించారు. ఇంటెన్సివ్ కేర్‌లో ఆరుగురు పరిస్థితి విషమ ంగా వుందన్నారు. పైగా గత రెండు రోజుల నుండి పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు ఆస్పత్రికి ఎక్కువగా వస్తున్నారని తెలిపారు. మానవతా సాయం తీసుకెళ్లే ట్రక్కులపై లూటీలు జరుగుతున్నాయని తెలిపారు.




మానవతా కారిడార్‌ను తెరిపించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు.

గాజాలో హమాస్ చెరలో వున్న బందీలను విడుదల చేస్తే ఒక్కొక్కరికి 50లక్షల డాలర్ల చొప్పున నగదు ఇస్తామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు బుధవారం ప్రకటించారు. రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్‌తో కలిసి ఆయన మాట్లాడారు.

లెబనాన్‌లో కొనసాగుతున్న దాడులు

మరోవైపు మంగళవారం లెబనాన్‌లో వందకు పైగా లక్ష్యాలపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది. లాంచర్లు, ఆయుధ నిల్వల కేంద్రాలు, కమాండ్ సెంటర్లు, మిలటరీ వ్యవస్థలపై దాడులు జరిపామని ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం హిజ్బుల్లా కమాండర్లు ఇద్దరిని హతమార్చినట్లు కూడా వెల్లడించింది.

రష్యా వైమానిక దాడుల హెచ్చరికలతో కీవ్‌లోని అమెరికా ఎంబసీ ఖాళీ



కీవ్ : రష్యా వైమానిక దాడి చేసే అవకాశం వుందని బుధవారం తమకు హెచ్చరిక వచ్చిందని కీవ్‌లోని అమెరికా ఎంబసీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఎంబసీని మూసివేస్తున్నట్లు వెల్లడించింది. రాయబార కార్యాలయంలోని ఉద్యోగులందరూ సురక్షిత ప్రాంతాల్లో వుండాల్సిందిగా ఎంబసీ సూచనలు జారీ చేసింది. అప్రమత్తంగా వుండాల్సి వస్తే తక్షణమే షెల్టర్లలో తల దాచుకునేందుకు సంసిద్దులు కావాల్సిందిగా కీవ్‌లోని అమెరికన్లకు సూచించింది. ఉక్రెయిన్‌లో రష్యా వైమానిక దాడులు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో ప్రత్యేకించి ఎంబసీకి హెచ్చరిక వచ్చినందున దీనిపై అప్రమత్తం అయ్యారు. రష్యాలోని బ్రియాన్స్క్ ప్రాంతంలో ఆయుధాల గిడ్డంగిపై అమెరికా తయారీ దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడి జరిగిందని మాస్కో ప్రకటించిన ఒక రోజు తర్వాత ఎంబసీపై దాడి హెచ్చరిక వెలువడింది. రష్యా లోపల ప్రాంతాలపై అమెరికా అందజేసిన ఆయుధాలతో ఉక్రెయిన్ దాడి చేసిన నేపథ్యంలో ఆ దాడిని నాటో దేశాలు, అమెరికా, యురోపియన్ దేశాలు చేసిన యుద్ధంగానే పరిగణిస్తామని పుతిన్ హెచ్చరించారు. అదే పరిస్థితి ఎదురైతే, మారిన ఆ ఘర్షణల ప్రభావాన్ని దృష్టిలో వుంచుకుని, తమకు వచ్చే బెదిరింపులను పరిగణనలోకి తీసుకుని తగు నిర్ణయాలు తీసుకుంటామని పుతిన్ పేర్కొన్నారు.

5.8 కోట్ల రేషన్ కార్డులు ఏరివేత

- 20.4 కోట్ల కార్డులే డిజిటలైజేషన్
- కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
దేశవ్యాప్తంగా 5.8 కోట్ల రేషన్ కార్డులను కేంద్ర ప్రభుత్వం ఏరివేసింది. నకిలీ కార్డుల పేరుతో వీటిపై వేటు వేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర వినియోగ వ్యవహారాలు, ప్రజా పంపిణీ, ఆహార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో మొత్తం 80.9 కోట్ల మంది లబ్ధిదారులున్నారని పేర్కొంది. ఆధార్ ఆధారిత ధ్రువీకరణ, ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఇకెవైసి) వెరిఫికేషన్ వంటి వాటి ద్వారా 5.8 నకిలీ రేషన్ కార్డులను తొలగించినట్లు తెలిపింది. ఇప్పటి వరకు 20.4 కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తయిందని, దేశవ్యాప్తంగా 5.33 లక్షల రేషన్ దుకాణాలకు ఇ-పోస్ పరికరాల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని పేర్కొంది. ఇ-పోస్ పరికరాల సాయంతో 99.8 శాతం రేషన్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయగా, 98.7 శాతం లబ్ధిదారుల ధ్రువీకరణ బయోమెట్రిక్ పూర్తయిందని తెలిపింది. ఇకెవైసి ప్రక్రియతో 64 శాతం లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయిందని తెలిపింది. నకిలీ కార్డుల పేరుతో కోట్లాది కార్డులను తొలగిస్తూ... అర్హులైన వారికి మొండిచేయి చూపుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. నిరక్షరాస్యత, సరైన అవగాహన లేకపోవడంతో కొత్త పద్ధతులకు అనుగుణంగా పత్రాలను సమర్పించలేని వారికి అన్యాయం చేస్తున్నారని పేర్కొంటున్నారు. 20.4 కోట్ల కార్డుల డిజిటలైజేషన్‌లోనే 5.8 కోట్ల మంది అనర్హులుగా తేలితే... 80 కోట్ల కార్డుల డిజిటలైజేషన్ పూర్తయితే ఎంతమందిని అనర్హులుగా చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

రోడ్డెక్కితే ట్యాక్సా?

(మొదటి పేజీ తరువాయి)

కోవిడ్ మహమ్మారి ఉన్నా కేంద్రం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించామని చెప్పారు. నాన్ గ్యారెంటీ అప్పులు కూడా చంద్రబాబు హయాంలో రూ.77 వేల కోట్లకు చేరాయనిఅన్నారు. చంద్రబాబు హయాంలో పారిశ్రామిక వృద్ధిరేటు 11.92 శాతం ఉంటే వైసిపి హయాంలో 12.61 శాతం ఉందని పేర్కొన్నారు.. తెలుగుదేశం నాయకులు ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్‌సిక్స్‌ను అమలు చేయకుండా వేర్వేరు ప్రచారాలతో ప్రజలను ఏమారుస్తున్నారని తెలిపారు.

వలంటీర్లు లేరు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు..' రాష్ట్రంలో గ్రామ, వార్డు వలంటీర్ల సంఖ్య ఎంత? వారి వేతనాలు పెంచేందుకు ప్రతిపాదన ఉందా? అని సభ్యులు ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు జవాబిస్తూ మంత్రి 'లేని వలంటీర్లకు వేతనాలు ఎలా ఇస్తాం... ఎలా పెంచుతాం?' అని ప్రశ్నించారు. 2023 ఆగస్టు నుండి వలంటీర్ల వ్యవస్థ రాష్ట్రంలో ఉనికిలో లేదని మంత్రి చెప్పారు. తమ ప్రభుత్వం కొనసాగించాలని భావించినా, సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాలేదని తెలిపారు. 'వలంటీర్లను వైసిపి ప్రభుత్వం రెన్యువల్ చేయలేదు. గత ప్రభుత్వ చర్యల వల్లే ఆ వ్యవస్థ మనుగడలో లేకుండా పోయింది. వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మేం ప్రయత్నించాం. కానీ, వ్యవస్థే ఉనికిలో లేకపోవడంతో ఏమీ చేయలేకపోయాం. వాళ్లు విధుల్లో ఉండి ఉంటే కొనసాగించే వాళ్లం.' అని మంత్రి చెప్పారు. 'వలంటీర్ల కొనసాగింపునకు సంబంధించిన జిఓలను గత ప్రభుత్వం ఇవ్వలేదు. 2023 ఆగస్టు వరకే గత ప్రభుత్వ జిఓ ఉంది. సెప్టెంబర్ నెలలో రెన్యువల్ జిఓ ఇవ్వలేదు. పైగా ఎన్నికల ముందు వారితో రాజీనామా చేయించారు. గత ప్రభుత్వం జిఓ ఇచ్చి కొనసాగించి ఉంటే, వారు విధుల్లో ఉండేవారు.

మేం కూడా వేతనాలు పెంచేవాళ్లం. అయినా, మే నెల వరకు వలంటీర్లకు మేం వేతనాలు ఇచ్చాం; అని ఆయన వివరించారు. ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, సభ్యులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీలు ఇచ్చాయని, ఇచ్చిన మాట ప్రకారం వారిని కొనసాగించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై మాట్లాడిన మంత్రి బాలా వీరాంజనేయస్వామి సిపిఎస్, సంపూర్ణ మద్యపాన నిషేధంపై ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం ఏ మాత్రం అమలు చేసిందని ప్రశ్నించారు.

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్‌డిఎకే మొగ్గు!

- పలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు
- మహారాష్ట్రలో ఎంవిఎదే అధికారమన్న లోక్‌సాహి, దైనిక్ భాస్కర్

న్యూఢిల్లీ : మహారాష్ట్ర, జార్ఖండ్‌ల్లో పోలింగ్ ముగియడంతో వెంటనే ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడ్డాయి. రెండు రాష్ట్రాల్లోనూ బిజెపి నేతృత్వంలోని కూటములే అధికారం చేపట్టవచ్చునని కొన్ని సంస్థలు, ఇండియా వేదికలోని పార్టీలదే అధికారమని మరికొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొన్నాయి. మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధిస్తుందని అంచనా వేయగా, జార్ఖండ్‌లో ఎన్‌డిఎ అధికారం చేపడుతుందని ఈ సర్వేలు వెల్లడించాయి. ప్రతిపక్ష మహా వికాస్ అగాఢి (ఎంవిఎ) కూటమిదే మహారాష్ట్రలో అధికారమని మరికొన్ని పోల్స్ పేర్కొన్నాయి. మహాయుతి కూటమికి పీపుల్స్ పల్స్, చాణక్య, మాట్రిజ్ సర్వేలు స్పష్టమైన మెజారిటీని కట్టబెట్టాయి. అదే సమయంలో లోక్‌సాహి మరాఠీ, దైనిక్ భాస్కర్ సంస్థలు మాత్రం ప్రతిపక్ష ఎంవిఎ కూటమికే మొగ్గు చూపాయి. 288సీట్లు గల మహారాష్ట్రలో మెజారిటీ రావాలంటే 145సీట్లు రావాలి. 81 సీట్లు గల జార్ఖండ్‌లో మెజారిటీకి 41సీట్లు అవసరం. 23న ఓట్ల లెక్కింపు జరగనుంది.

హోరాహోరీ... ఎంవిఎకే మొగ్గు...

మహారాష్ట్రలో మహాయుతి, ఎంవిఎ మధ్య హోరా హోరీ పోరు వుంటుందని లోక్‌షాహి రుద్ర సర్వే పేర్కొంది. వరుసగా 128-142సీట్లు, 125-140సీట్లు లభిస్తాయని పేర్కొంది. ఇతరులకు 18నుండి 23వరకు సీట్లు రావచ్చని అంచనా వేసింది. లోక్‌పాల్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ ప్రకారం 37-40శాతం ఓట్ల వాటాతో మహాయుతి 115-128 స్థానాలు గెలుస్తుందని అంచనా వేసింది. 43 నుండి 46శాతం ఓట్ల వాటాతో 151 నుండి 162 మధ్య సీట్లు గెలిచి ఎంవిఎ విజయం సాధిస్తుందని పేర్కొంది. 16నుండి 19శాతం ఓట్ల వాటాతో ఇతరులు ఐదు నుండి 14సీట్లు గెలుపొందుతారని అంచనా వేసింది.

జార్ఖండ్‌లో 81 సీట్లకు గానూ కాంగ్రెస్-జెఎంఎం కూటమికి 53సీట్లు వస్తాయని ఆక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు కేవలం 25 సీట్లే వస్తాయని ఇతరులకు మూడు సీట్లు వస్తాయని పేర్కొంది.

ఎన్‌డిఎకే మొగ్గు...

పలు వార్తా సంస్థలతో కలిసి మాట్రిజ్ ఎగ్జిట్ పోల్స్ నిర్వహించింది. మహారాష్ట్రలో బిజెపికి 150 నుండి 170సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. 48శాతం ఓట్లు లభిస్తాయని పేర్కొంది. కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాలకు 110 నుండి 130సీట్లు వస్తాయని పేర్కొంది. ఈ కూటమికి 42శాతమే ఓట్లు లభిస్తాయని తెలిపింది. పది శాతం ఓట్లతో ఇతరలకు 8 నుండి 10సీట్లు ఇచ్చింది.

ఇక జార్ఖండ్‌లో ఎన్‌డిఎకు 42 నుండి 47సీట్లు వస్తాయని మాట్రిజ్ ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. ఇండియా బ్లాక్‌కు 25 నుండి 30సీట్లు మాత్రమే వస్తాయని పేర్కొంది. మహాయుతికి 175 నుండి 195సీట్లు వస్తాయని పీపుల్స్ పల్స్ సర్వే అంచనా వేసింది. ఎంవిఎకు 85 నుండి 112 సీట్లు వస్తాయని, ఇతరులకు 7-12 సీట్లు వస్తాయని చెప్పింది. జార్ఖండ్‌లో ఎన్‌డిఎకు 44-53 సీట్లు, ఇండియా బ్లాక్‌కు 25-37సీట్లు, ఇతరులకు 5-9సీట్లు వస్తాయని అంచనా వేసింది.

ఇండియా బ్లాక్‌కు 45శాతం ఓటు వాటా రాగా, ఎన్‌డిఎకు 37శాతం ఓటు వాటా లభిస్తుందని ఆక్సిస్ మై ఇండియా జోస్యం చెప్పింది.

పి-ఎంఎఆర్క్యు అనే మరో సంస్థ మహారాష్ట్రలో ఎన్‌డిఎకు 137-157సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఇండియా బ్లాక్‌కు చెందిన ఎంవిఎకు 126-146సీట్లు, ఇతరులకు 2-8సీట్లు వస్తాయని అంచనా వేసింది.

ఎలక్టోరల్ ఎడ్జ్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ ఎంవిఎకు 150 స్థానాలు కట్టబెట్టింది. మహాయుతికి 121 సీట్లు, ఇతరులకు 20సీట్లు వస్తాయని పేర్కొంది.

పోల్ డైరీ అంచనాల ప్రకారం మహారాష్ట్రలో ఎన్‌డిఎకు 122-186, ఎంవిఎకు 69-121, ఇతరులకు 12-29 సీట్లు వస్తాయి. చాణక్య స్ట్రాటజీస్ సర్వే ప్రకారం, మహాయుతికి 152-160, ఎంవిఎకు 130-138, ఇతరులకు 6-8 సీట్లు వస్తాయి. ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన సెంటర్ ఫర్ గ్లోబల్ స్టడీస్ (సిజిఎస్) నిర్వహించిన సర్వే మహారాష్ట్రలో మహాయుతి అలయన్స్, జార్ఖండ్‌లో ఎన్‌డిఎ గెలుస్తుందని అంచనా వేసింది. ఉత్తరప్రదేశ్‌లోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో బిజెపి ఐదు నుండి ఏడు స్థానాలు గెలుచుకుంటుందని కొన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

గ్యాంగ్ స్టర్ల రాజధానిలా ఢిల్లీ

- కేంద్ర హోంమంత్రిపై సిఎం అతిషి ఆగ్రహం

న్యూఢిల్లీ : ఢిల్లీలో శాంతి భద్రతలు క్షీణించాయని, గ్యాంగ్‌స్టర్ల రాజధానిగా మారిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అతిషి కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతవారం ఈశాన్య ఢిల్లీలోని సుందర్ నగరిలో హత్యకు గురైన 28 ఏళ్ల యువకుని తల్లిదండ్రులను బుధవారం అతిషి కలిశారు. రూ.10 లక్షలు నష్టపరిహారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఢిల్లీలో నేరస్థులు, దోపిడీదారులు, గూండాలు భయంలేకుండా తిరుగుతున్నారని చెప్పారు. వారు ఎవరిపైనైనా కాల్పులు జరిపినా, హత్యలు చేసినా, కత్తితో పొడిచినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించారు. ప్రతిరోజూ దోపిడీలు, హత్యలు జరుగుతున్నా... కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పట్టించుకోవడం లేదని, ఎన్నికల ప్రచారంపైనే దృష్టిపెట్టారని అన్నారు.

ధాన్యం రైతు దైన్యం

(మొదటి పేజీ తరువాయి)

5.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖాధికారుల అంచనా. ప్రస్తుతం 25 శాతం విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయి. జిల్లాలో 277 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే, చాలా కేంద్రాల్లో ఇంకా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. కొన్నిచోట్ల నామమాత్రంగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. నిబంధనల పేరుతో తిరిగి పంపుతున్నారు. ఈ నెల తొమ్మిది నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 1,290 మంది రైతుల వద్ద రూ.27 కోట్ల విలువైన 11,791 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగింది. సాధారణ రకం క్వింటాలుకు రూ.2,300, గ్రేడ్-ఎ రకం రూ.2,320 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. తేమ, ఇతర నిబంధనల వల్ల రైతులకు ఆ ధర దక్కడం లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ఏర్పాటు చేసినా క్షేత్ర స్థాయిలోని సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. తేమ శాతం నిబంధనలు, సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లింపు జరగకపోవడం, గోనె సంచులు అందుబాటులో లేకపోవడం, కొనుగోలు కేంద్రాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తులకు తెగనమ్ముకోవాల్సి వస్తోందని చెప్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో దాదాపు 17 లక్షల గోనె సంచులు అవసరం కాగా, ఇప్పటివరకు 4.5 లక్షల సంచులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 116 సిఎంఆర్ రైస్ మిల్లులను గుర్తించారు. ఇందులో 63 మిల్లులు రూ.81 కోట్ల వరకు బ్యాంకు గ్యారంటీలు సమర్పించాయి. మిగతా మిల్లులు నేటికీ గ్యారంటీలను ఇవ్వలేదు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడానికి 875 వాహనాలు అవసరమని అధికారుల అంచనా. ప్రస్తుతం 661 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో పది వేల టన్నులకుపైనే ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. కనీస మద్దతు ధర కన్నా తక్కువకు కొందరు మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ప్రైవేటుకు అమ్మాను



మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాను. వంద బస్తాల దిగుబడి వచ్చింది. 75 కేజీల బస్తాను రూ.1,600 చొప్పున ప్రైవేటు వ్యక్తికి అమ్ముకోవాల్సి వచ్చింది. తేమ శాతం నిబంధనలు, వాతావరణ పరిస్థితుల వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తులకు ధాన్యాన్ని విక్రయించాను. రూ.12,500 వరకూ నష్టపోయాను.

- బోడకుర్తి ఏసుబాబు, రైతు గొల్లప్రోలు.

అధికారులు అందుబాటులో లేరు



పది ఎకరాల్లో సన్నాలు ధాన్యం సాగు చేశాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి వెళ్తే అధికారులు అందుబాటులో లేరు. 75 కేజీల బస్తాను రూ.1,550 చొప్పున ప్రైవేట్‌గా అమ్ముకోవాల్సి వచ్చింది.

- కాకర నాగేశ్వరరావు, రైతు, జగ్గంపేట.

త్వరలో బ్యాంకు గ్యారంటీలు

మిల్లర్లు త్వరలోనే బ్యాంకు గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకుంటాము. ఇప్పటివరకు జిల్లాలో రూ.27 కోట్లు విలువైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాము. 17 లక్షల గోనె సంచులు అవసరం కాగా, ఇప్పటివరకు 4.5 లక్షల సంచులు ఆన్‌లైన్ అయ్యాయి. మిగిలినవి కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.

- డి.నాయక్, సివిల్ సప్లయ్ డిఎం



ఆటలాడే అక్షరాలు



అక్షరాలం అక్షరాలం
ముద్దు ముద్దు చిన్నారుల
చిలుక పలుకులం

అక్షరాలం అక్షరాలం
జట్టుగా ఆడుతాం, పాడుతాం
పదాలుగా, పాదాలుగా

అక్షరాలం అక్షరాలం
శృతిలయలతో పరుగులు తీస్తాం
భాషకి అలంకారాలౌతాం

అక్షరాలం అక్షరాలం
సుకవి కలాలలో
జాలువారే అమృతధారలం


అక్షరాలం అక్షరాలం
శబ్దాలతో ఉరుముతాం
అర్థాలతో లాలిస్తాం

అక్షరాలం అక్షరాలం
పదునైన కత్తులం
అన్యాయాన్ని ఎదిరిస్తాం

అక్షరాలం అక్షరాలం
సంస్కారాల విత్తులం
జ్ఞానానికి ప్రతీకలం

అక్షరాలం అక్షరాలం
జాతికి వారసులం
నాగరికతా సారధులం

– డా.నీరజ అమరవాది,
98491 60055.



దారి చూపండి

పిల్లలూ, చెర్రీ పండు తినాలనుకునే వారు ఏ దారి గుండా లోపలకి వెళతారో దారి చూపరూ!

నేను గీసిన బొమ్మ



ఎన్.గగన్
దయాకర్,
7వ తరగతి,
మాంటిస్సోరి స్కూలు,
దుగ్గిరాల.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



రాజు... పేదరిక కుటుంబం నుంచి వచ్చాడు. పుట్టుకతో వచ్చిన దృష్టి లోపం తనలో ఎన్నో ఆవేదనలు, ఆందోళనలకు గురిచేసింది. అయితే చిన్నప్పటి నుంచీ పాటలంటే రాజుకి ఎంతో ఇష్టం. సంగీత పాఠాలు నేర్వకుండానే స్వరాలను ఒంటబట్టించుకున్నాడు. పక్కింటి టేప్ రికార్డ్‌లో వచ్చే పాటలు వింటూ ఏకలవ్య సాధన చేశాడు. తన పాటకి తానే తాళం కొట్టుకోవాలని ఓ కిరోసిన్ డబ్బా, సత్తు రూపాయి బిళ్ల సాధనాలుగా చేసుకున్నాడు. అక్కడ నుంచి మొదలైన రాజు ప్రయాణం ఇప్పుడు సంగీత దర్శకుడు తమన్ తన సినిమాలో పాట పాడించుకునే వరకు వెళ్లింది.

మనసును తాకే రాజు పాట ..!

రంగారెడ్డి జిల్లా, షంషాబాద్ మండలం. ధమ్మీగూడ గ్రామం రాజు స్వస్థలం. హనుమయ్య, సత్తవ్వ తల్లీదండ్రి. ముగ్గురు అక్కలు, ఒక చెల్లి మధ్య పుట్టిన మగపిల్లవాడు రాజు. పుట్టుకతోనే కళ్లు లేవు. తోబుట్టువులందరికీ పెళ్లిళ్లయ్యాయి. తండ్రి చనిపోయాడు. ప్రస్తుతం చెల్లి, బావ సంరక్షణలో రాజు, అతని తల్లి ఉంటున్నారు.

పాట ఇలా మొదలైంది..

పాటలు ఎలా సాధన చేశావు అని రాజుని ఎవరైనా ప్రశ్నిస్తే.. 'నాకు పాడాలని చిన్నప్పటి నుంచి ఉండేది. కళ్లు లేవని, అందరిలా ఆడుకోవడం లేదని చాలా బాధపడేవాడ్ని. కళ్లు ఉంటే బాగుండు అని ఎన్నో సార్లు అనుకునేవాణ్ణి. ఇంట్లోనే ఉండేవాణ్ణి. ఎక్కడికీ వెళ్లలేకపోయేవాణ్ని. అప్పుడే నా చెవులకి దూరంగా ఓ పాట వినిపించింది. అది టేప్‌రికార్డర్ నుంచి వస్తోంది. అప్పట్లో టేప్ రికార్డులు వచ్చిన కొత్త. మా ఊళ్లో ఎక్కువ సౌండ్ పెట్టి వినేవాళ్లు. అలా ఆ పాటలు నా చెవినపడ్డాయి. ఆ పాటలు నన్ను గుమ్మం దాటేలా చేశాయి. పాట ఇంకా బాగా వినిపించాలని ఆ శబ్ధం వస్తున్నవైపు వెళ్లి పిట్టగోడపై కూర్చొని వినేవాడ్ని. ఇంట్లో ఉన్న కిరోసిన్ డబ్బా, రూపాయి బిళ్లతో సహా గోడ ఎక్కేసేవాడ్ని. అక్కడే పాటకి తగ్గట్టుగా తాళం వేసుకుంటూ హమ్మింగ్ చేసేవాడ్ని. మొదట్లో నాకు పాట పాడడం వచ్చేది కాదు. హమ్మింగ్ చేస్తూ చేస్తూ పైకి పాడడం అలవాటైంది. వానొచ్చినా, ఎండొచ్చినా, చలిగా ఉన్నా పాటే నా తోడైంది' అంటూ తన తొలి ప్రయాణం రోజులను రాజు గుర్తుకుచేసుకున్నారు.

కళ్లు ఉంటే బాగుణ్ణు అనుకున్నా..

'నాన్న చనిపోయాక అమ్మే నా ఆలనాపాలనా చూసుకుంటోంది. నేను ఎక్కడికి వెళ్లాలన్నా అమ్మే తీసుకెళ్తుంది. సంగీతం క్లాసులకు వెళ్లాలంటే రోజుకు నాలుగైదు బస్సులు మారాలి. ఇంత ప్రయాణంలో ఆమె నాకు తోడుంటుంది. ఇప్పుడు తను కూడా పెద్దదైపోయింది. అందుకే చెల్లి వాళ్లు చూసుకుంటున్నారు. ఈ పరిస్థితే నాకు బాధేస్తుంది. నేనెప్పుడూ ఒకళ్ల మీద ఆధారపడకూడదని అనుకుంటాను. సొంతంగా నడవాలని, పరుగెత్తాలని, ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లాలని అనుకునేవాడ్ని. అది మాత్రం తీరడం లేదు.. తీరదని కూడా చెప్పేశారు' అంటున్న రాజు, కళ్లు బాగు చేయించుకోవాలని చాలా ప్రయత్నం చేశారు. అయితే చికిత్స వల్ల ఇప్పుడు చూపు రాదని వైద్యులు తేల్చి చెప్పేశారు. 'ఆ రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు దఫదఫాలుగా నాకు పరీక్షలు చేశారు. చివరికి చూపు రాదని చెప్పారు. అప్పుడు నాకు చాలా ఏడుపు వచ్చింది. ఎలాగైనా చూపు వస్తుందని ఎంతో ఆశపడ్డాను' అని చెబుతున్న రాజు మాటలు ఆ క్షణం బాధతో వణికాయి.

గొంతుతో పాట.. చేత్తో వాయిద్యం

రాజులో అన్నీ ప్రత్యేకతలే.. మొదటిసారి పాట మొదలు పెట్టినప్పుడు కిరోసిన్ డబ్బా, రూపాయి బిళ్లతో ఎలా దరువు వేశాడో.. ఇప్పుడు కూడా అలాగే.. కుడిచేత్తో ఒక రకమైన శబ్ధం వచ్చేలా చేస్తాడు. అది ఎలా ఉంటుందంటే చిడతలతో వచ్చినంత గంభీరమైన స్వరం అక్కడ వినిపిస్తుంది. రెండో చేత్తో కాలిపై తాళం వేస్తున్నట్లుగా దరువు వేస్తాడు. మాస్ పాటైనా, క్లాస్ పాటైనా రెండు చేతులూ అలా ఆడిస్తూనే పాట పాడడం రాజు అలవాటు. అతను పాట పాడడం చూసిన వారెవరైనా తనలా అనుకరించాలని చూసినా అది అసలు సాధ్యం కాదు.

'పలాస' టైటిల్ సాంగ్ రాజుదే..

సినిమా రంగంలోకి రాజు ప్రవేశం యాదృచ్ఛికం కాదు. ఎన్నో రోజులు.. కాదు కాదు.. ఎన్నో సంవత్సరాలు ఎంతోమందిని రాజు కలిశాడు. తన అభిమాన గాయకుడు ఎస్‌బి బాలసుబ్రమణ్యాన్ని కలవాలని ఎంతో తపించాడు. అప్పుడు అందరూ అతణ్ణి పిచ్చివాడని అన్నారు. 'నువ్వేంటి బాలు సార్‌ని కలవడమేంటి' అని నవ్వారు. ఎగతాళి చేశారు. అయినా రాజు తన ప్రయత్నాలు ఆపలేదు. స్థానికంగా ఎక్కడ సినిమా షూటింగులు ఉంటే అక్కడ ప్రత్యక్షమైపోయేవాడు. అలా 2014లో కొరియోగ్రాఫర్ జాకీ మాస్టర్‌కి రాజు గురించి తన సహచరుడి ద్వారా తెలిసింది. ఆయన రాజుతో 'సదా శివ.. ' అంటూ సాగే పాట పాడించుకుని ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. అప్పట్లో అది బాగా వైరల్ అయ్యింది. ఆ మాస్టారు ప్రోత్సాహంతోనే తనని వెతుక్కుంటూ ఓ అవకాశం వచ్చిందని రాజు చెబుతారు.

'సంగీత దర్శకులు రఘు కుంచె 2019లో 'పలాస'లో రాజుతో టైటిల్ సాంగ్ పాడించారు. 'నాకు మొట్టమొదట అవకాశం ఇచ్చింది ఆయనే. జులై 19న ఆ పాట పాడాను' అని చెబుతున్న రాజు.. ఎప్పుడెప్పుడు ఎవరెవరిని కలిసిందీ, ఆ తేదీలు, వారాలు, సంవత్సరాలు ఎక్కడా తడబడకుండా చెబుతారు. ఎప్పుడో చాన్నాళ్ల క్రితం జరిగిన సంఘటనలను గురించి అంత గుర్తుగా చెబుతున్నప్పుడు అతని జ్ఞాపకశక్తిని మెచ్చుకోకుండా ఉండలేం.

మామంచి మాస్టారు..

ఎందరో గాయనీ గాయకులను సినీ పరిశ్రమకి పరిచయం చేసిన రామాచారి మాస్టారు దగ్గర రాజు ఇప్పుడు సంగీతంలో నైపుణ్యం సాధిస్తున్నాడు. ఇక్కడికి తన స్నేహితుడి ద్వారా రాజు వచ్చారు. కాలేజీకి వెళ్లే ఆ స్నేహితుడే ఐదు సెషన్ల వరకు రాజుని సంగీతం క్లాసులకు తీసుకొచ్చేవాడు. ఇప్పుడు అతను వేరే ఊరు వెళ్లిపోవడంతో రాజు వాళ్ల అమ్మ ఆ బాధ్యత తీసుకొంది. రామాచారి మాస్టారంటే రాజుకు వల్లమాలిన అభిమానం. వేలల్లో విద్యార్థులున్న ఆ మాస్టారుకీ రాజంటే అమితమైన ప్రాణం. 'మా గురుశిష్యులిద్దరి అనుబంధం ఒక్కమాటతో చెప్పడం కష్టం. రామాచారి మాస్టారు.. మామంచి మాస్టారు' అంటూ ఉప్పొంగిపోతూ చెబుతారు రాజు. రాజుకి మృదంగం అంటే ఇష్టమని ఓ మృదంగం కొనిచ్చి, జయకుమార్ మాస్టారు దగ్గర మృదంగం నేర్చుకునేందుకు పంపిస్తున్నారు రామాచారి. అంతేకాదు.. రాజు చిరకాల కోరిక, తన అభిమాన గాయకుడు ఎస్‌పి బాలసుబ్రమణ్యాన్ని కలిసే అవకాశం కూడా ఇచ్చారు. కర్నాటక సంగీతంలో తనకి ఓనమాలు నేర్పించిన వసంతలక్ష్మీ టీచరు, బుచ్చయ్యాచారీ మాస్టారు గురించి కూడా రాజు ఎప్పుడూ గుర్తుచేసుకుంటారు.

అమ్మ గురించి చెప్పమంటే..

'అమ్మానాన్న నన్ను ఎప్పుడూ తిట్టలేదు. కొట్టలేదు. సినిమా పాటలు పాడతాను. గాయకుడ్ని అవుతాను. అన్ని చిన్నప్పటి నుంచి అంటుండేవాడ్ని. అందరూ ఆడుకుంటున్నారు. అందరికీ ఫ్రెండ్స్ ఉన్నారు. నాకు లేరు. నేను ఇలా ఉన్నానేంటి? అని బాధపడని క్షణం లేదు. చూపు లేకపోవడం నా తప్పు కాదు. కానీ ఆ లోపంతో ఎంతో వివక్ష ఎదుర్కొన్నాను. చాలా బాధేసేది' అని రాజు తన జీవితంలో ఎదురైన చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

అవకాశాలు రాలేదు..

'పలాస'లో పాట పాడిన తరువాత రాజుని పట్టించుకున్నవారే లేరు. కరోనా వచ్చి అతని కళని మరుగునపడేసింది. 'అప్పుడు ఎంతో బాధపడ్డాను' అని రాజు ఎప్పుడూ చెబుతాడు. అలాంటి రాజు 'నా పాట ఎవరూ వినడం లేదు.. అందరూ వినాలంటే నేను గొప్ప గాయకుడ్ని కావాలి' అని ఓరోజు గట్టిగా అనుకున్నాడు. ఇప్పుడు రవీంద్ర భారతి, సుందరయ్య విజ్ఞానకేంద్రం వంటి ఎన్నో చోట్ల జరిగే కచేరీల్లో రామాచారి మాస్టారి బృందంతో కలసి పాటలు పాడుతున్నాడు.

మృదంగం నేర్చుకోవడానికి బస్సులో వెళ్తున్న రాజు మొన్న శనివారం బస్సులో ఓ పాట పాడాడు. దాన్ని ఓ యువతి తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. అది బాగా వైరల్ అయ్యింది. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ రాజుని పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. అతనికి అవకాశం ఇవ్వమని ఎంఎం కీరవాణిని ట్యాగ్ చేశారు. ఈలోపే రాజుకి తన సినిమాలో పాట పాడే అవకాశం ఇస్తానని తమన్ ముందుకువచ్చారు. ఇప్పుడు ఈ విషయమే రాజుని సోషల్ మీడియా స్టార్ చేసింది. ఎక్కడ చూసినా అతని ఇంటర్వ్యూలే వస్తున్నాయి. ఈ సందర్భంగా, తనని పాట పాడమన్న ఆ బస్సు కండక్టరుకి, సోషల్ మీడియాలో షేర్‌చేసిన యువతికి, తన గ్రామ ప్రజలకి రాజు ఎంతో సంతోషంగా కృతజ్ఞతలు చెబుతున్నారు.

సాధారణ ప్రజల్లో ఉన్న టాలెంట్‌ని గుర్తించి కొంతమంది ఔత్సాహిక సంగీత దర్శకులు అవకాశాలు ఇవ్వడం గతంలో బాలీవుడ్‌లో, ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీలో చూస్తున్నాం. అలాంటి వారిలో రఘు కుంచె ముందుంటారు. ఆయన అవకాశమిచ్చిన గాయని బేబీ అప్పట్లో ఓ సంచలనం. కానీ ఇప్పుడు ఆమె ఎక్కడా కనిపించడం లేదు. టాలెంట్‌ని గుర్తించడమంటే ఇది కాదు.. వారి జీవితాలు కాస్తో కూస్తో బాగుపడేలా అప్పుడప్పుడైనా ప్రోత్సాహం ఇవ్వాలి. అలాంటప్పుడే రాజు లాంటి ఎందరో సమాజానికి పరిచయమవుతారు.



'మిస్టర్ ఇడియట్' పాట విడుదల

నటుడు రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. జేజేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పీ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జెజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గౌరీ రోణంకి దర్శకత్వం వహిస్తున్నారు. నటుడు శివాజీ చేతుల మీదుగా 'వస్సాహి వస్సాహి..' లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సాంగ్ బ్యూటిఫుల్ కంపోజిషన్‌తో కలర్‌ఫుల్ పిక్చరైజేషన్‌తో ఆకట్టుకుందని అభినందించారు. సినిమాల్లో సంస్కృత భాషలో ఏ పాటా రాలేదని, ఇదే మొదటిది అయివుంటుందని ప్రశంసించారు. ఈ పాటను శివశక్తి దత్తా రాయగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందించారు. శ్రీరామచంద్ర పాడారు. నటులు మాధవ్, సిమ్రాన్‌శర్మతో పాటు జయప్రకాష్, ఆచంట మహేష్, అజయ్ ఘోష్, శ్రీకాంత్ అయ్యంగార్, కాశీవిశ్వనాథ్, హిమజ తదితరులు పాల్గొన్నారు.



వాళ్లను రానీయకండి..

యూట్యూబ్ ఛానల్స్, కొంతమంది నెటిజన్లు ఇచ్చే రివ్యూలు సినిమా ఫలితంపై ప్రభావం చూపుతున్నాయని తమిళ్ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తాజాగా ఓ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఎక్స్ వేదికగా బుధవారం పోస్ట్ పెట్టింది. 'ఈ ఏడాది విడుదలైన చాలా చిత్రాలపై రివ్యూలు ప్రభావం చూపించాయి. ముఖ్యంగా 'ఇండియన్ 2', 'వేట్టయన్', 'కంగువా' ఫలితాలపై పబ్లిక్ టాక్, యూట్యూబ్ ఛానల్స్ ఇచ్చే విశ్లేషణలు ఎంతో ఎఫెక్ట్ చూపింది. రానురాను చిత్ర పరిశ్రమకు ఇదొక సమస్యగా మారుతోంది. దీనిని కట్టడి చేసేందుకు పరిశ్రమలోని అన్ని సంఘాలూ ఏకం కావాలి. పరిశ్రమ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి. ఇందులో భాగంగా థియేటర్ యజమానులు యూట్యూబ్ ఛానల్స్‌ను సినిమా హాళ్ల ప్రాంగణంలోకి అనుమతించకూడదు. ఫస్ట్ డే.. ఫస్ట్ షో సమయంలో థియేటర్ వద్ద పబ్లిక్ రివ్యూలకు అవకాశం కల్పించకూడదు. అలాగే, రివ్యూల పేరుతో నటీనటులు, దర్శక నిర్మాతలపై వ్యక్తిగత విమర్శలను మేము ఖండిస్తున్నాం. ఇకపై అలాంటివాటికి పాల్పడితే అంగీకరించేది లేదు' అని పేర్కొంది.

'డ్యూడ్' షూటింగ్ సగం పూర్తి



పనోరమిక్ స్టూడియోస్ పతాకంపై తేజ్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న వినూత్న త్రిభాషా చిత్రం 'డ్యూడ్'. ఫుట్‌బాల్ నేపథ్యంలో బలమైన భావోద్వేగాలతో సాగే ఈ చిత్రాన్ని ఫుట్‌బాల్ ప్రేమికుడైనకన్నడ సూపర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌కు అంకితమిచ్చారు. రంగాయన రఘు ఫుట్‌బాల్ కోచ్‌గా ముఖ్యపాత్ర పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ 50 శాతం పూర్తయ్యిందని మేకర్లు ప్రకటించారు. ఈ సినిమాను వచ్చే జూన్‌లో విడుదల చేస్తామని తెలిపారు. రాఘవేంద్ర రాజ్‌కుమార్ మరో కీలకపాత్రలో నటిస్తున్నారు. శాన్య కావేరమ్మ, మేఘ, మోహిత, ధృతి, అనర్ఘ్య, దిపాలి పాండే, సిరి ఎవాంజిలిన్, సోను తీర్థగౌత్, యశస్విని, మెర్సి, మోనిష తదితరులు ఫుట్‌బాల్ అంటే ఇష్టమైన వారిగా నటిస్తున్నారు. మహమ్మద్ సంగీతాన్ని అందిస్తున్నారు.

సరికొత్తగా 'యమ జాలీ.. లవ్ మీ లైలా'



ఎస్‌పి క్రియేషన్స్ పతాకంపై కె.మహేశ్వర నిర్మాతగా, డైరెక్టర్ సాయిపవన్ సుంకర తెరకెక్కించబోయే కొత్త సినిమా 'యమజాలీ.. లవ్ మీ లైలా'. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో టైటిల్‌ను ప్రొడ్యూసర్ కె.మహేశ్వర, డైరెక్టర్ సాయి సుంకర, సినీ నటులు వీరంకి వెంకట నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం మహేశ్వర, సాయిపవన్ సుంకర మాట్లాడారు. "పూర్తిగా గ్రామీణ వాతావరణంలో జాలీ లవ్, ఫన్ ఎలిమెంట్లతో ఈ సినిమాను తెరకెక్కిస్తాం. గతంలో 'యమ' పేరు ఉన్న యమదొంగ, యమగోల, యమలీల, యముడు, యముడికి మొగుడు తదితర సినిమాలు హిట్ అయ్యాయి. మా సినిమాకు అలాంటి ఆదరణే ఆశిస్తున్నాం. సినిమా ఆద్యంతం సస్పెన్స్‌తో కూడిన ఎమోషన్స్, కామెడీ ఉంటాయి.' అని చెప్పారు. దర్శకరత్న దాసరి నారాయణరావు వద్ద నేర్చుకున్న మెళకువలతో ఈ సినిమాకు కథ, పాటలు తాను రాశాననీ, కొత్తదనంతో తీసేందుకు ప్రయత్నిస్తున్నామని సాయిపవన్ సుంకర అన్నారు.

కేసీఆర్ మూవీని ఆదరించాలి : రాకేష్



తాను హీరోగా నటించిన చిత్రం 'కేసీఆర్'ను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆదరించా లని జబర్దస్త్ రాకేష్ కోరారు. కేసీఆర్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా బుధవారం నాడు ఆయన తన సతీమణి సుజాతతో కలిసి విజయవాడలో పర్యటించారు. తెలంగాణా, ఆంధ్రాలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని చెప్పారు. విజయవాడ ప్రాంతం సినిమాలకు అడ్డాగా నిలుస్తుందని, ఇక్కడి ప్రజల అభిమానం ఉంటే ఏ సినిమా అయినా విజయం సాధిస్తుందని అన్నారు.

అదరగొట్టిన అమ్మాయిలు

- ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్
- ఫైనల్లో చైనాపై 1-0తో గెలుపు



ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీతో భారత మహిళల జట్టు

రాజ్‌గిర్(బీహార్): భారత మహిళల హాకీ జట్టు ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీని మరోసారి ముద్దాడింది. బిహార్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్టేడియంలో బుధవారం జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారతజట్టు బుధవారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో చైనాను 1-0తో ఓడించి వరుసగా రెండోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను మూడో క్వార్టర్‌లో దీపిక కుమారి చేసింది. 31వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను దీపిక గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. భారత్‌కు చైనా గట్టి పోటీ ఇచ్చింది. దాంతో తొలి రెండు క్వార్టర్లలో ఇరుజట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే, మూడో క్వార్టర్స్‌లో దీపికా గోల్ చేసి భారత్‌ను ఆధిత్యంలో వెళ్లేలా చేసింది. ఈ టోర్నీలో దీపికకు ఇది 11వ గోల కావడం విశేషం. గతేడాది రాంచీలో 2016లో సింగపూర్‌లో ఈ టైటిల్‌ను గెలుచుకున్న భారత జట్టు అద్భుతంగా సమన్వయం చేస్తూ చైనాను నిలువరించింది. తొలి అర్ధభాగంలో ఎలాంటి గోల్ చేయకపోయినా.. ద్వితీయార్ధం తొలి నిమిషంలో దీపికా పెనాల్టీ కార్నర్‌లో గోల్ చేసి అభిమానుల్లో జోష్ నింపింది. మూడో క్వార్టర్‌లోనే భారత్‌కు ఆధిక్యాన్ని రెట్టింపు చేసే సువర్ణావకాశం లభించింది. అయితే 42వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌లో దీపిక కొట్టిన షాట్‌ను చైనా గోల్‌కీపర్ కుడివైపు డైవ్ చేసి కాపాడింది. మూడో క్వార్టర్‌లో భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించినా.. గోల్‌గా మలచలేకపోయారు. అయితే, మ్యాచ్ చివరలో మరోసారి భారత క్రీడాకారులు తడబడ్డారు. జపాన్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో 16 పెనాల్టీ కార్నర్‌లో ఒక్క దాన్ని కూడా గోల్స్‌గా మలచలేకపోయిన విషయం తెలిసిందే. ఫైనల్‌లో మొదటి 30 నిమిషాల్లోనూ నాలుగు పెనాల్టీ కార్నర్ వృథా అయ్యాయి. పెనాల్టీ కార్నర్‌లో గోల్ సాధించడం భారత్‌కు బలహీనంగా మారింది. ఈ టైటిల్‌ను భారత్ చేజిక్కించుకోవడం ఇది మూడోసారి. దక్షిణ కొరియా జట్టు కూడా గతంలో మూడుసార్లు విజేతగా నిలిచింది. మూడోస్థానం కోసం మలేషియాతో జరిగిన పోరులో జపాన్ జట్టు 4-1 గోల్స్‌తో గెలిచింది.

బీహార్ ప్రభుత్వం నగదు నజరానా..

టైటిల్ విజేతగా నిలిచిన భారతజట్టుకు బీహార్ ప్రభుత్వం నగదు పురస్కారాలను ప్రకటించింది. ఒక్కో ప్లేయర్‌కు రూ.3లక్షలు నగదు అందజేయనున్నట్లు.. అలాగే సహాయ, ఇతర సిబ్బందికి రూ.1.50లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

టీమిండియా టైటిల్ కొట్టిందిలా..!

ఫైనల్	: చైనాపై (1-0)గెలుపు
సెమీఫైనల్	: జపాన్‌పై (2-0)గెలుపు
గ్రూప్‌దశలో...	
మలేషియాపై	: 4-0తో గెలుపు
దక్షిణ కొరియాపై	: 3-2తో గెలుపు
చైనాపై	: 3-0తో గెలుపు
జపాన్‌పై	: 3-0తో గెలుపు

తిలక్ వర్మ @ 3వ ర్యాంక్

ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ యువ స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ సత్తా చాటాడు. ఏకంగా 69 స్థానాలను మెరుగుపరుచుకొని టాప్-3లో నిలిచాడు. ఐసిసి బుధవారం వెల్లడించిన టి20 బ్యాటర్ల జాబితాలో తిలక్ 806 రేటింగ్ పాయింట్లతో 3వ స్థానంలో నిలువగా.. సూర్యకుమార్ యాదవ్ 788రేటింగ్ పాయింట్లతో నాల్గో స్థానంలో ఉన్నాడు. టాప్-10లో ముగ్గురు భారత బ్యాటర్లు చోటు దక్కించుకోగా.. యశస్వి జైస్వాల్(706) 8వ స్థానంలో ఉన్నాడు. టి20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ముగ్గురు టీమిండియా ఆటగాళ్లు చోటు సంపాదించడం ఇదే తొలిసారి. హెడ్(ఆస్ట్రేలియా) 855పాయింట్లతో అగ్రస్థానంలో, సాల్ట్(ఇంగ్లండ్) 828 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు నాలుగు టి20ల సిరీస్‌లో తిలక్ వర్మ రెండు శతకాలతో రాణించడంతో అతని ర్యాంక్ మెరుగైంది. ఈ పర్యటనలో రాణించిన మరో భారత బ్యాటర్ సంజు శాంసన్(598) 22వ స్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టోయినిస్ నాలుగో స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ వనిందు హసరంగ ఐదో స్థానంలో నిలిచారు.

సింధు, లక్ష్యసేన్ శుభారంభం

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



లీ-నింగ్(చైనా): చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో పివి సింధు, లక్ష్యసేన్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సింధు 21-17, 21-19తో బూసానన్(థాయ్‌లాండ్)పై వరుససెట్లలో విజయం సాధించింది. ఈ మ్యాచ్ కేవలం 50 నిమిషాల్లోనే ముగిసింది. రెండుసెట్లలోనూ ప్రత్యర్ధిపై గెలిచేందుకు సింధు చెమటోడ్చాల్సి వచ్చింది. మరో సింగిల్స్‌లో మాల్విక బన్సోద్ 20-22, 23-21, 21-16తో హోజ్మార్క్(డెన్మార్క్)ను ఓడించగా.. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-14. 13-21. 21-13తో 7వ సీడ్ మలేషియాకు చెందిన లీ-జి-జియాను చిత్తుచేశాడు. డబుల్స్‌లో 6వ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ కూడా రెండోరౌండ్‌కు చేరింది. తొలిరౌండ్‌లో వీరు 12-21, 21-19, 21-18తో చైనీస్ తైపీకి చెంది లీ జియా-యంగ్‌లను చిత్తుచేశారు. ఈ మ్యాచ్ సుమారు గంటా ఆరు నిమిషాలసేపు సాగింది. మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట 21-15, 21-14తో తైపీ జంటను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68